**విలేకరులు కావలెను**

'వజ్రభారతి' తెలుగు దినపత్రిక లో
ఆంధ్ర ప్రదేశ్ మరియు
తెలంగాణ రాష్ట్రాలలో
అన్ని జిల్లాలకు, మండలాలకు
నియోజకవర్గ ఇన్‌ఛార్జిలు,
మండల విలేకరులు కావలెను.

**98498 39560**



Cell : 98498 39560

RNI.No : APTEL/2021/80994

Dare to Write... Dare to fight


# వజ్రభారతి

vajrabharathi@gmail.com

ఎడిటర్ :
పమ్మి ఏడుకొండలు

సామాజిక, రాజకీయ జాతీయ తెలుగు దినపత్రిక








సంపుటి : 5 | సంచిక : 114 | ఎడిటర్ : పి.ఏడుకొండలు | వెల : 2 రూపాయిలు | తేదీ: శుక్రవారం 24-4-2026 | పేజీలు : 10 | E-mail:vajrabharathi@gmail.com


# రాష్ట్రానికి ఆదాయాన్నిచ్చే నగరంగా అమరావతి అభివృద్ధి

## ల్యాండ్ పూలింగ్ రైతులకు కౌలు పెంచుతూ కీలక నిర్ణయం



- వేల కోట్ల విలువైన ప్రాజెక్టులకు సీఆర్డీఏ సమావేశంలో ఆమోదం
- ప్రతిష్టాత్మక విద్యా, ప్రభుత్వ సంస్థలకు భూముల కేటాయింపు
- 2027 నుంచి బిట్స్ పిలానీలో అడ్మిషన్లు ప్రారంభం
- అమరావతిలో బిట్స్ పిలానీ క్యాంపస్ పనులపై సీఎంతో సమీక్ష
- క్వాంటం, ఏఐ విభాగాలను ఏర్పాటు చేస్తున్నట్టు వెల్లడి
- 2027 నుంచి అడ్మిషన్లు ప్రారంభించాలని నిర్ణయం
- క్యాంపస్ నిర్మాణం, విస్తరణ కోసం రూ.250 కోట్ల వ్యయం
- మొత్తం 10 వేల మంది విద్యార్థులకు విద్యావకాశాలు

అమరావతి రాజధాని కోసం భూములిచ్చిన రైతులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శుభవార్త అందించింది. వారి జీవనోపాధికి భరోసా కల్పిస్తూ వార్షిక కౌలును గణనీయంగా పెంచుతూ కీలక నిర్ణయం తీసుకుంది. మెట్ట భూములకు ఎకరాకు ఇచ్చే కౌలును రూ.40 వేలకు, జరీబు భూములకు రూ.60 వేలకు పెంచింది. అంతేకాకుండా, రాబోయే పదేళ్లపాటు ప్రతీ ఏటా మెట్ట భూములకు రూ.3 వేలు, జరీబు భూములకు రూ.5 వేల చొప్పున కౌలు పెంచేందుకు కూడా ఆమోదం తెలిపింది. గురువారం సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన 60వ సీఆర్డీఏ అథారిటీ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ఈ నిర్ణయం రాజధాని రైతులపై ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని తెలియజేస్తోందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఈ సమావేశంలో రాజధాని నిర్మాణానికి సంబంధించి ఆగిపోయిన పనులను తిరిగి ప్రారంభించేందుకు, కొత్త పనులకు శ్రీకారం చుట్టేందుకు వేల కోట్ల రూపాయల విలువైన ప్రతిపాదనలకు సీఆర్డీఏ అథారిటీ ఆమోదముద్ర వేసింది. ఇందులో



## భగ్గుమంటున్న ఏపీ..

- పలుచోట్ల 45 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు
- రాష్ట్రంలోని 151 మండలాలకు ఈదురుగాలుల హెచ్చరిక
- 62 మండలాల్లో తీవ్రమైన, 89 మండలాల్లో సాధారణ ఈదురుగాలుల సూచన
- పలు జిల్లాల్లో 45 డిగ్రీలు దాటి కొనసాగుతున్న ఎండల తీవ్రత
- శ్రీకాకుళం జిల్లా కొత్తూరులో అత్యధికంగా 45.4 డిగ్రీల ఉష్ణోగ్రత



## భారత్ గొప్ప దేశం..

- అంతలోనే మాటమార్చిన ట్రంప్!
- 'నరక కూపం' వివాదం తర్వాత భారత్‌పై ట్రంప్ ప్రశంసలు
- భారత్ గొప్ప దేశమని, తనకు మంచి స్నేహితుడు ఉన్నాడని వ్యాఖ్య
- అమెరికన్ రేడియో హోస్ట్ వ్యాఖ్యలను ట్రంప్ రీపోస్ట్ చేయడంతో దుమారం


2లో



## పోటెత్తిన ఓటింగ్

- బెంగాల్ తొలి విడతలో 92.72%.. తమిళనాడులో 85.14%
- రెండు రాష్ట్రాల్లో సరికొత్త రికార్డు సృష్టించిన ఓటర్లు
- చెదురుమదురు ఘటనలు మినహా ప్రశాంతంగా ముగిసిన ఎన్నికలు
- ఎస్ఐఆర్ తర్వాత తొలి ఎన్నికల్లో ఉత్సాహంగా పాల్గొన్న జనం
- ఓటు హక్కు వినియోగించుకున్న ప్రముఖులు, సినీ నటులు

# ఆర్టీసీ సమ్మెలో విషాదం




- సమ్మెలో భాగంగా ఆత్మహత్యాయత్నం చేసిన శంకర్‌గౌడ్
- హైదరాబాద్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున కన్నుమూత
- ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం చేయాలని డిమాండ్ చేస్తూ ఆత్మార్పణ
- కార్మికులు ఆందోళన విరమించాలని భుత్వం విజ్ఞప్తి
- నేడు కార్మిక సంఘాలతో ప్రభుత్వ చర్చలు

తెలంగాణ ఆర్టీసీ సమ్మెలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ప్రభుత్వంలో ఆర్టీసీని విలీనం చేయాలనే ప్రధాన డిమాండ్‌తో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన నర్సంపేట డిపో డ్రైవర్ కోల శంకర్‌గౌడ్ (55) మృతి చెందారు. 80 శాతం కాలిన గాయాలతో హైదరాబాద్‌లోని అపోలో డీఆర్‌డీవో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున 3 గంటలకు ఆయన తుదిశ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆర్టీసీ కార్మిక సంఘాల జేఏసీ పిలుపు మేరకు గురువారం రాష్ట్రవ్యాప్తంగా సమ్మె కొనసాగింది. ఈ క్రమంలో వరంగల్ జిల్లా నర్సంపేట బస్టాండ్ ఎదుట శంకర్‌గౌడ్ ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడంలో జరుగుతున్న జాప్యాన్ని నిరసిస్తూ ఆయన ఈ అఘాయిత్యానికి పాల్పడ్డారు. తోటి కార్మికులు, పోలీసులు వెంటనే మంటలు ఆర్పినప్పటికీ తీవ్ర గాయాలయ్యాయి. తొలుత వరంగల్ ఎంజీఎంకు, ఆ తర్వాత మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. అయితే, పరిస్థితి విషమించడంతో ఆయన ప్రాణాలు కోల్పోయారు.

### ఉద్రిక్తంగా మారిన సమ్మె

శంకర్‌గౌడ్ మరణంతో రాష్ట్రవ్యాప్త ఆర్టీసీ సమ్మెలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఇదే తరహాలో నల్గొండ, ఖమ్మం జిల్లాల్లో మరో ఇద్దరు డ్రైవర్లు కూడా ఆత్మహత్యాయత్నానికి పాల్పడటం కార్మికుల్లో నెలకొన్న తీవ్ర ఆందోళనను స్పష్టం చేస్తోంది. మరోవైపు, రెండో

2లో



## మే 4న మిఠాయిలు, ఝాల్‌మురీ తినిపిస్తాం

- అది తృణమూల్ కాంగ్రెస్ పార్టీకి 'ఎక్స్‌పైరీ డేట్'
- పశ్చిమ బెంగాల్ ఎన్నికల్లో బీజేపీ విజయం తథ్యం
- తొలి విడతలో భారీ ఓటింగ్ ప్రజల ఆకాంక్షకు నిదర్శనం
- మార్పునకు అనుకూలంగా అఖండమైన తీర్పు రాబోతోంది
- బెంగాల్ ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీ స్పష్టీకరణ
- ఎన్నికల్లో హింస తగ్గినందుకు ఎన్నికల సంఘానికి అభినందనలు



## ఒంటిమిట్ట కోదండరామస్వామి ఆలయ అర్చకులకు టీటీడీ షోకాజ్ నోటీసులు

- జగన్ నివాసానికి వెళ్లి ఆశీస్సులు అందించిన ఒంటిమిట్ట అర్చకులు..
- మాజీ సీఎం జగన్ నివాసానికి వెళ్లి వేదాశీర్వచనం అందించడమే కారణం
- ఆలయ నిబంధనలను ఉల్లంఘించారని అర్చకులపై టీటీడీ ఆగ్రహం
- రెండు రోజుల్లోగా వివరణ ఇవ్వాలని నోటీసుల్లో స్పష్టం

2లో




## 100 రోజుల్లో ఉద్యోగులకు బిల్లులు

- ప్రణాళిక రూపకల్పన బాధ్యత మంత్రివర్గ ఉప సంఘానికి
- కేబినెట్ భేటీ వివరాలు వెల్లడించిన మంత్రి పొంగులేటి
- రూ.8 వేల కోట్లకు చేరిన బకాయిలతో ఇక్కట్లలో రిటైర్డ్ ఉద్యోగులు
- ప్రత్యామ్నాయ మార్గాలన్నీ అన్వేషించి అవసరమైన నిధుల సర్దుబాటు
- వచ్చే నెల 4న జరిగే తదుపరి కేబినెట్‌లో చెల్లింపులపై నిర్ణయం

## ఒంటిమిట్ట కోదండరామస్వామి ఆలయ అర్చకులకు టీటీడీ షోకాజ్ నోటీసులు

ఒంటిమిట్టలోని శ్రీ కోదండరామస్వామి ఆలయానికి చెందిన ముగ్గురు అర్చకులపై తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆలయ నిబంధనలకు విరుద్ధంగా, పులివెందులలో మాజీ సీఎం జగన్ నివాసానికి వెళ్లి ఆయనకు వేదాశీర్వచనం అందించినందుకు గాను వారికి షోకాజ్ నోటీసులు జారీ చేసింది. టీటీడీ పరిధిలో ఉన్న ఈ ఆలయంలో పనిచేసే అర్చకులు ప్రొటోకాల్‌ను అతిక్రమించడంపై యాజమాన్యం తీవ్రంగా స్పందించింది. వ్యక్తిగత హోదాలో రాజకీయ నాయకుల ఇళ్లకు వెళ్లి ఆలయ మర్యాదలను పాటించకపోవడం సరికాదని భావించింది. ఈ నేపథ్యంలోనే సదరు అర్చకులపై చర్యలకు ఉపక్రమించింది. అర్చకులకు జారీ చేసిన షోకాజ్ నోటీసుల్లో రెండు రోజుల్లోగా తమ వివరణ సమర్పించాలని టీటీడీ స్పష్టం చేసింది. వారు ఇచ్చే సమాధానం సంతృప్తికరంగా లేకపోతే కఠినమైన క్రమశిక్షణా చర్యలు తప్పవని హెచ్చరించినట్లు తెలుస్తోంది. ఆలయ పవిత్రత, నియమ నిబంధనల విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని టీటీడీ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. ప్రస్తుతం ఈ నోటీసులపై అర్చకుల నుంచి ఇంకా ఎలాంటి స్పందన రాలేదు. వారి వివరణ అందిన తర్వాత టీటీడీ తదుపరి చర్యలు తీసుకోనుంది.

## భారత్ గొప్ప దేశం..

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌ను 'గొప్ప దేశం' అని అభివర్ణిస్తూ, తనకు అక్కడ ఒక 'చాలా మంచి స్నేహితుడు (మోదీ)' ఉన్నారని ప్రశంసించారు. అయితే, భారత్‌ను 'నరక కూపం' (హెల్ హోల్) అంటూ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలున్న పోడ్‌కాస్ట్‌ను రీపోస్ట్ చేసిన తర్వాత, ట్రంప్ నుంచి ఈ వ్యాఖ్యలు రావడం గమనార్హం. ఇటీవల అమెరికన్ రేడియో హోస్ట్ మైఖేల్ సేవేజ్ తన పాడ్‌కాస్ట్‌లో భారత్, చైనాలను 'నరకకూపాలు'గా అభివర్ణించారు. అమెరికాలో జన్మస్థలం ఆధారంగా పౌరసత్వం (బర్త్‌రైట్ సిటిజన్‌షిప్) ఉండటాన్ని ఆసరాగా చేసుకుని, ఆయా దేశాల మహిళలు తొమ్మిదో నెల గర్భంతో అమెరికాకు వచ్చి పిల్లల్ని కంటున్నారని, తద్వారా సులువుగా పౌరసత్వం పొందుతున్నారని ఆయన ఆరోపించారు. భారతీయులను 'ల్యాప్‌టాప్‌లతో ఉన్న గ్యాంగ్‌స్టర్లు'గా ఆయన వ్యాఖ్యానించారు. ఈ పాడ్‌కాస్ట్ వీడియోను, ట్రాన్‌స్క్రిప్ట్‌ను ట్రంప్ తన సోషల్ మీడియాలో రీపోస్ట్ చేయడంతో పెద్ద దుమారం రేగింది. ఈ వివాదం నేపథ్యంలో ట్రంప్ భారత్‌పై తన వైఖరిని స్పష్టం చేసే ప్రయత్నం చేశారు. 'భారత్ ఒక గొప్ప దేశం. ఆ దేశ నాయకత్వంలో నాకు ఒక మంచి స్నేహితుడు ఉన్నారు' అని ట్రంప్ అన్నట్లు న్యూఢిల్లీలోని అమెరికా ఎంబసీ ప్రతినిధి క్రిస్టోఫర్ ఎల్మ్స్ తెలిపారు. ఈ వివాదంపై భారత విదేశాంగ శాఖ ప్రతినిధి రంధీర్ జైస్వాల్ స్పందిస్తూ, "మేము కొన్ని నివేదికలు చూశాం, అంతకు మించి మాట్లాడడానికేమీలే దు" అని క్లుప్తంగా బదులిచ్చారు. అమెరికాలో వలస విధానాలు, బర్త్‌రైట్ సిటిజన్‌షిప్‌పై తీవ్రంగా చర్చ జరుగుతున్న సమయంలో ఈ ఘటనలు చోటుచేసుకున్నాయి. మొత్తంమీద, ఈ వివాదం ద్వారా చెలరేగిన దుమారాన్ని చల్లార్చేందుకే ట్రంప్ భారత్‌తో తన స్నేహాన్ని మరోసారి గుర్తుచేశారని విశ్లేషకులు భావిస్తున్నారు.

## మే 4న మిఠాయిలు, ఝాల్‌మురీ తినిపిస్తాం

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లో అధికార తృణమూల్ కాంగ్రెస్ పార్టీకి మే 4వ తేదీయే 'ఎక్స్‌పైరీ డేట్' అని ప్రధాని నరేంద్ర మోదీ తేల్చిచెప్పారు. రాష్ట్రంలో 15 ఏళ్ల సిండికేట్ వ్యవస్థ, మహా జంగిల్‌రాజ్ అంతమైపోతుందని స్పష్టంచేశారు. ప్రధాని మోదీ గురువారం బెంగాల్‌లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. రెండో విడత అసెంబ్లీ ఎన్నికలు జరిగే మధురాపూర్, కృష్ణానగర్ నియోజకవర్గాల్లో బహిరంగ సభల్లో ప్రసంగించారు. తొలి విడత ఎన్నికల్లో భారీగా ఓటింగ్ నమోదు కావడం తృణమూల్ కాంగ్రెస్‌పై ప్రజా వ్యతిరేకతకు నిదర్శనమని పేర్కొన్నారు. ఓటర్లకు అభినందనలు తెలియజేశారు. ఈ ఓటింగ్‌ను 'మార్పు కోసం ఇచ్చిన తీర్పు'గా అభివర్ణించారు. బెంగాల్ ఓటర్ల నిర్ణయం మేరకు మార్పునకు అనుకూలంగా అఖండమైన తీర్పు రాబోతోందని అన్నారు. అధికార పార్టీ సృష్టించిన భయాన్ని బీజేపీ ఇస్తున్న భరోసా చిత్తుచిత్తుగా ఓడించబోతోందని స్పష్టంచేశారు. బీజేపీ ప్రభంజనం సృష్టించడం తథ్యమని ధీమా వ్యక్తంచేశారు. దేశంలో భారీ ఓటింగ్ నమోదైన ప్రతిచోటా బీజేపీ విజయాలు సాధిస్తోందని వెల్లడించారు. వచ్చే నెల 4న ఓట్ల లెక్కింపు పూర్తయ్యాక విజయోత్సవాలు నిర్వహిస్తామని, బెంగాల్ ప్రజలకు మిఠాయిలతోపాటు ఝాల్‌మురీ పంపిణీ చేస్తామని మోదీ ప్రకటించారు. బెంగాల్‌లో తాను ఝాల్‌మురీ రుచిని ఆస్వాదించడం కొందరికి పిడుగుపాటు లాంటి షాక్ ఇచ్చిందన్నారు. తాను ఝాల్‌మురీ రుచి చూస్తే తృణమూల్ కాంగ్రెస్ నాయకులకు మిరపకాయల ఘాటు తగులుతోందని ఎద్దేవా చేశారు. తొలి దశ ఎన్నికల సందర్భంగా హింసాకాండను కనిష్ట స్థాయిలో ఉంచినందుకు ఎన్నికల సంఘాన్ని అభినందించారు. 50 ఏళ్ల బెంగాల్ ఎన్నికల చరిత్రలో హింసాత్మక ఘటనలు కనిష్ట స్థాయికి తగ్గడం ఇదే మొదటిసారి అని వెల్లడించారు. "బెంగాల్‌లో లంచాలు లేకుండా పనులు జరిగే రంగం ఒక్కటి కూడా లేదు. టీఎంసీ సిండికేట్లు, వారి మధ్యవర్తులు కట్ మనీ తీసుకోని రంగమే లేదు. 15 ఏళ్ల సిండికేట్ వ్యవస్థ, మహా జంగిల్‌రాజ్‌కు కాలం చెల్లిపోయింది. ఆ గడువు మే 4వ తేదీ. తప్పుడు వాగ్దానాలతో ప్రజలను మోసం చేసినందుకు మమతా బెనర్జీ ప్రభుత్వం బాధ్యత వహించాలి. వరదలతో ఇబ్బందులు పడుతున్న ప్రాంతాల్లో వంతెనలు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. చివరకు ప్రజలను దగా చేశారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు బెంగాల్‌లో అమలు కాకుండా అడ్డుకున్నారు. అభివృద్ధి పనుల కోసం కేంద్రమిచ్చిన నిధులను స్వాహా చేశారు.

## తెలంగాణ రాష్ట్ర పండుగగా వాసవీ మాత జయంతి...

2తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. శ్రీ వాసవీ మాత జయంతిని రాష్ట్ర పండుగగా అధికారికంగా ప్రకటించింది. ఇకపై ప్రతి సంవత్సరం వైశాఖ శుక్ల పక్ష దశమి నాడు రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ లాంఛనాలతో ఈ వేడుకలను నిర్వహించనున్నారు. ఈ ఏడాది ఏప్రిల్ 26న వాసవీ జయంతి రానుండటంతో, ఆ రోజున ఉత్సవాలు జరపాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు బుధవారం 67ను జారీ చేశారు. ఈ ఉత్తర్వుల ప్రకారం, రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు తమ తమ జిల్లాల్లో వాసవీ మాత జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించాల్సి ఉంటుంది. ఈ ఉత్సవాల నిర్వహణ బాధ్యతలను యువజన సర్వీసులు, పర్యాటక, సాంస్కృతిక శాఖకు నోడల్ ఏజెన్సీగా అప్పగించారు. వేడుకలకు అవసరమైన నిధులను ఆ శాఖ బడ్జెట్ నుంచే కేటాయించాలని ఉత్తర్వుల్లో స్పష్టంగా పేర్కొన్నారు. ఈ నిర్ణయంతో వాసవీ మాత జయంతి ఉత్సవాలు రాష్ట్రవ్యాప్తంగా అధికారికంగా జరగనున్నాయి.

# 100 రోజుల్లో 'రిటైర్డ్' బకాయిలు!

హైదరాబాద్: రిటైర్డ్ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం బకాయి పడిన రూ.8 వేల కోట్ల పైచిలుకు పదవీ విరమణ ప్రయోజనాలను వచ్చే 100 రోజుల్లోగా ఎలా చెల్లించాలనే అంశంపై ప్రణాళిక సిద్ధం చేయాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. వనరుల సమీకరణపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నేతృత్వంలో ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘానికి ఈ బాధ్యతను అప్పగించింది. వచ్చే నెల 4న జరగనున్న తదుపరి మంత్రివర్గ సమావేశంలో మంత్రివర్గ ఉప సంఘం సిఫారసులపై చర్చించి నిర్ణయం తీసుకోవాలని తీర్మానించింది. గురువారం సచివాలయంలో సీఎం ఎ.రేవంత్‌రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర కేబినెట్ సమావేశమైంది. రిటైర్డ్ ఉద్యోగులకు రూ.8 వేల కోట్లు, ఇన్ సర్వీస్ ఉద్యోగులకు మరో రూ.6,200 కోట్లు కలిపి మొత్తం రూ.14,200 కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉందని అధికారులు నివేదించారు. దీంతో పాటు ఇతర అంశాలు చర్చించిన మంత్రివర్గం పలు నిర్ణయాలు తీసుకుంది. భేటీ అనంతరం రాష్ట్ర సమాచార, ప్రజాసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి..సహచర మంత్రులు ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వాకిటి శ్రీహరితో కలిసి వివరాలు వెల్లడించారు. 'ఉమ్మడి ఏపీలో ఉద్యోగులు రిటైరైన కొన్ని నెలలకే పదవీ విరమణ ప్రయోజనాలను చెల్లించే వారు. అయితే తెలంగాణ ఏర్పడిన తర్వాత పదేళ్లు పాలించిన గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.వేల కోట్ల బకాయిలను మిగిల్చిపోయింది. మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తొలి ఏడాది రిటైర్డ్ ఉద్యోగులకు బిల్లులు చెల్లించలేకపోయాం. కానీ గత 14 నెలలుగా ప్రతి నెలా రూ.750 కోట్ల నుంచి రూ.800 కోట్లను చెల్లించుకుంటూ వస్తున్నాం. అయితే రిటైర్డ్ ఉద్యోగులు ఆఫీసులు, సచివాలయం చుట్టూ తిరుగుతూ ఇబ్బందులు పడుతుండటంపై మంత్రివర్గం ఆందోళన వ్యక్తం చేసింది. ఈ క్రమంలోనే రెగ్యులర్ ఉద్యోగుల బకాయిలను సైతం సత్వరమే చెల్లించేందుకు ఏర్పాట్లు చేయాలనే ఆలోచన చేసింది.

**ప్రజా ప్రతినిధుల జీతాల నుంచి 50% కోత**

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దృష్ట్యా బకాయిలను వెంటనే చెల్లించలేని పరిస్థితి ఉన్నప్పటికీ ప్రత్యామ్నాయ మార్గాలన్నీ అన్వేషించి, అవసరమైన నిధులు సర్దుబాటు చేయాలని కేబినెట్ నిర్ణయించింది. సీఎం, మంత్రులతో పాటు ప్రజా ప్రతినిధుల జీతాల నుంచి 50 శాతం నిధులను కోత పెట్టి రిటైర్డ్ ఉద్యోగుల బిల్లుల చెల్లింపులకు వినియోగించాలని తీర్మానించింది. బకాయిల చెల్లింపులపై ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు, రిటైర్డ్ ఉద్యోగుల సంఘాలతో చర్చలు జరిపి సమస్య పరిష్కారానికి సూచనలు చేయాలని వనరుల సమీకరణపై ఏర్పాటైన మంత్రివర్గ ఉప సంఘానికి కేబినెట్ సూచించింది..' అని పొంగులేటి తెలిపారు. సీఎం రేవంత్‌తో పాటు త్వరలో సీబీఐ డైరెక్టర్‌ను కలిసి కాళేశ్వరం బరాజ్‌ల నిర్మాణంలో అవకతవకతలపై విచారణ చేపట్టాలని కోరతామని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. 'కాళేశ్వరం ప్రాజెక్టుపై కాగ్, ఎన్డీఎస్ఏ, విజిలెన్స్ నివేదికలను ఇప్పటికే సీబీఐకు పంపించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టాలని కోరి 9 నెలలు గడుస్తున్నా స్పందన లేదు. మళ్లీ త్వరలోనే ఈ నివేదికలను సీబీఐ డైరెక్టర్‌కు కూడా అందజేస్తాం..' అని అన్నారు. కేవలం బరాజ్‌లపై మాత్రమే విచారణ కోరుతున్నామంటూ మంత్రి ఓ ప్రశ్నకు బదులిచ్చారు. మొత్తం కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంపై సీబీఐ విచారణ చేస్తే చేయమనండి అని అన్నారు. కాళేశ్వరంపై జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ సమర్పించిన నివేదికపై తాజాగా రాష్ట్ర హైకోర్టు వెలువరించిన తీర్పు సారాంశాన్ని అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి మంత్రివర్గానికి వివరించినట్టు ఉత్తమ్ తెలిపారు. ఘోష్ కమిషన్ నియామకాన్ని, కమిషన్ ఇచ్చిన నివేదికను కూడా హైకోర్టు తప్పు బట్టలేదని అన్నారు. కేసీఆర్, హరీశ్‌రావు, ఎస్కే జోషి, స్మిత సబర్వాల్ తమ పిటిషన్లలో చేసిన ఆరోపణలతో న్యాయస్థానం ఏకీభవించలేదని చెప్పారు.

# పోటెత్తిన ఓటింగ్

కోల్‌కతా/చెన్నై: ఓటర్లలో వెల్లువెత్తిన చైతన్యానికి సంకేతంగా పశ్చిమ బెంగాల్ తొలి విడత అసెంబ్లీ ఎన్నికల్లో, ఒకే విడతలో జరిగిన తమిళనాడు ఎన్నికల్లో రికార్డు స్థాయిలో ఓటింగ్ నమోదైంది. గురువారం 152 స్థానాలకు జరిగిన బెంగాల్ ఎన్నికల్లో 92.72 శాతం, మొత్తం 234 స్థానాలకు జరిగిన తమిళనాడు ఎన్నికల్లో 85.14 శాతం ఓటింగ్ నమోదు కావడం విశేషం. రెండు రాష్ట్రాల్లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్) సర్వే ద్వారా అర్హత లేని లక్షలాది ఓట్లను తొలగించిన తర్వాత జరిగిన ఈ ఎన్నికల్లో రికార్డుస్థాయిలో ఓటింగ్ నమోదవడం గమనార్హం. శుక్రవారం ఉదయం కల్లా తుది గణాంకాలు రావొచ్చు. బెంగాల్‌లో అక్కడక్కడా హింసాకాండ చోటుచేసుకోవడం మినహా తొలి విడత పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. కనిష్ట స్థాయిలో హింస జరగడం బెంగాల్ ఎన్నిక చరిత్రలో ఇదే మొదటిసారి అని విశ్లేషకులు చెబుతున్నారు. తమిళనాడులోనూ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకపోవడంతో ఎన్నికల సంఘం ఊపిరి పీల్చుకుంది. ప్రజాస్వామ్య ప్రక్రియలో పాలుపంచుకోవడానికి, దేశ పౌరులుగా తమ విధిని నిర్వర్తించడానికి ఓటర్లు ఉదయం నుంచే పోలింగ్ కేంద్రాల వద్ద బారులుతీరి ఉత్సాహంగా ఓటువేశారు. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన ఓటింగ్ సాయంత్రం 6 గంటలకు ముగిసింది. సమయం ముగిసినా పోలింగ్ కేంద్రాల ఎదుట రద్దీ తగ్గలేదు. వరుసలో నిల్చున్నవారందరికీ ఓటు వేసే అవకాశం కల్పించారు. రాజకీయ నాయకులు, సినీ ప్రముఖులు, వ్యాపారవేత్తలు ఓటు హక్కు వినియోగించుకున్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత పశ్చిమ బెంగాల్, తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో అత్యధిక ఓటింగ్ నమోదు కావడం ఇదే మొదటిసారి. ఈ నెల 9న జరిగిన అస్సాం, పుదుచ్చేరి ఎన్నికల్లోనూ మునుపెన్నడూ లేని రీతిలో అత్యధిక ఓటింగ్ నమోదైంది. అస్సాంలో 85.38 శాతం, పుదుచ్చేరిలో 89.83 శాతం నమోదయ్యింది. బెంగాల్, తమిళనాడులో ఇప్పటిదాకా 2011 నాటి ఎన్నికల ఓటింగే అత్యధికం. అప్పట్లో బెంగాల్‌లో 84.72 శాతం, తమిళనాడులో 78.29 శాతం ఓటింగ్ నమోదైనట్లు ఎన్నికల సంఘం వెల్లడించింది. ఆ రికార్డును ఈసారి ఓటర్లు తిరగరాశారు. రెండు రాష్ట్రాల్లో పురుషుల కంటే మహిళలే అత్యధికంగా ఓటింగ్‌లో పాల్గొన్నారు. తమిళనాడులో పురుషులు 83.57 శాతం మంది ఓటువేయగా, మహిళలు 85.76 శాతం మంది ఓటువేశారు. బెంగాల్‌లో పురుషులు 90.92 శాతం, మహిళలు 92.69 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఓటింగ్‌లో సరికొత్త రికార్డు సృష్టించిన రెండు రాష్ట్రాల ఓటర్లకు సెల్యూట్ చేస్తున్నామని ప్రధాన ఎన్నికల కమిషనర్(సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ అన్నారు. బెంగాల్‌లో ఎస్ఐఆర్ ద్వారా 91 లక్షల ఓట్లను తొలగించారు. ఈ నేపథ్యంలో అర్హులైన ఓటర్లలో 91.78 శాతం మంది ఓటు వేశారు. బెంగాల్‌లో తొలి విడత ఎన్నికల సందర్భంగా హింసాకాండ చోటుచేసుకుంది. అధికార టీఎంసీ, విపక్ష బీజేపీ కార్యకర్తలు ఘర్షణకు దిగారు. ఉద్రిక్తత పరిస్థితులను సైతం లెక్కచేయకుండా జనం భారీగా పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చారు. హింసాత్మక ఘటనలు ఓటర్ల ఉత్సాహాన్ని తగ్గించలేకపోయాయి. 2021లో 82.30 శాతం ఓటింగ్ నమోదు కాగా, గురువారం 92 శాతం దాటేసింది.

## ఆర్టీసీ సమ్మెలో విషాదం

రోజైన గురువారం కూడా సమ్మె కొనసాగింది. ప్రభుత్వం తాత్కాలిక డ్రైవర్లు, కండక్టర్లతో, పోలీసు బందోబస్తు మధ్య సుమారు 45 శాతం బస్సులను నడిపినట్లు అధికారులు తెలిపారు. అయితే, బస్సులు సరిపడా లేకపోవడంతో ప్రైవేటు వాహనదారులు ప్రయాణికుల నుంచి అధిక ఛార్జీలు వసూలు చేస్తూ దోపిడీకి పాల్పడ్డారు. ఈ వరుస పరిణామాలతో ప్రభుత్వం అప్రమత్తమైంది. కార్మికులు ఆత్మహత్యల వంటి తొందరపాటు చర్యలకు పాల్పడవద్దని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్‌తో సహా పలువురు విజ్ఞప్తి చేశారు. సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని, చర్చలకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఇందులో భాగంగా శుక్రవారం కార్మిక సంఘాల నాయకులతో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలో మంత్రుల కమిటీ చర్చలు జరపనుంది. శంకర్‌గౌడ్ మృతికి ప్రభుత్వ వైఖరే కారణమని కార్మిక సంఘాలు ఆరోపిస్తున్నాయి. తమ 32 డిమాండ్లు నెరవేరే వరకు సమ్మె విరమించేది లేదని, నిరసనలను మరింత ఉద్ధృతం చేస్తామని ఆర్టీసీ జేఏసీ స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో, ప్రభుత్వం-కార్మిక సంఘాల మధ్య జరగబోయే చర్చలు కీలకం కానున్నాయి.

## భగ్గుమంటున్న ఏపీ..

ఆంధ్రప్రదేశ్‌లో వాతావరణం ప్రజలను ఆందోళనకు గురిచేస్తోంది. ఓవైపు ఎండలు మండిపోతుండగా, మరోవైపు ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురుస్తాయని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్డీఎంఏ) హెచ్చరించింది. శుక్రవారం రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం రాష్ట్రంలోని 62 మండలాల్లో తీవ్రమైన ఈదురుగాలులు, మరో 89 మండలాల్లో సాధారణ ఈదురుగాలులు వీచే అవకాశం ఉంది. దీనికి అదనంగా మరో 7 మండలాల్లో తీవ్రమైన, 31 మండలాల్లో సాధారణ గాలులు కూడా నమోదయ్యే సూచనలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ప్రజలు చెట్ల కింద, శిథిలావస్థలో ఉన్న భవనాల వద్ద ఆశ్రయం పొందవద్దని సూచించారు. మరోవైపు రాష్ట్రంలో ఎండల తీవ్రత ఏమాత్రం తగ్గడం లేదు. గురువారం పలు ప్రాంతాల్లో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. శ్రీకాకుళం జిల్లా కొత్తూరులో అత్యధికంగా 45.4 డిగ్రీల సెల్సియస్, కడపలో 45.1, మన్యం జిల్లా సాలూరులో 45.1, నంద్యాల జిల్లా ఆళ్లగడ్డలో 44.9 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

# రాష్ట్రానికి ఆదాయాన్నిచ్చే నగరంగా అమరావతి అభివృద్ధి



భాగంగా, అమరావతి క్వాంటం వ్యాలీలో ట్విన్ టవర్ల నిర్మాణం కోసం రూ.1208.41 కోట్లకు పాలనానుమతి ఇచ్చారు. సచివాలయం, జీఏడీ, హెచ్ఓడీ టవర్ల నిర్మాణంలో అత్యంత కీలకమైన ఫాసేడ్, గ్లేజింగ్, క్లాడింగ్ పనుల కోసం రూ.2540 కోట్లు, ఏపీ శాసనసభ భవనంలో వివిధ సివిల్ పనుల కోసం రూ.798 కోట్ల వ్యయానికి అథారిటీ ఆమోదం తెలిపింది. వీటితో పాటు ల్యాండ్ పూలింగ్ స్కీమ్ (ఎల్పీఎస్) జోన్ 11లో రోడ్లు, డ్రైన్లు, నీటి సరఫరా వంటి మౌలిక వసతుల పనులకు, రాజధానిలో 220 కేవీ విద్యుత్ లైన్ల రీరూటింగ్ పనులకు కూడా అనుమతులు మంజూరు చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ, అమరావతిని కేవలం పరిపాలనా రాజధానిగానే కాకుండా, రాష్ట్రానికి ఆదాయాన్ని ఆర్జించి పెట్టే రెవెన్యూ ఎర్నింగ్ సిటీగా అభివృద్ధి చేయాలని అధికారులకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. రాజధానిలో చేపట్టే ప్రతి నిర్మాణం తెలుగు సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా ఉండాలని, అదే సమయంలో ప్రపంచస్థాయి ఐకానిక్ డిజైన్లతో అద్భుతమైన అనుభూతిని కలిగించాలని సూచించారు. అమరావతిని హరిత, నీలి నగరంగా (గ్రీన్ అండ్ బ్లూ సిటీ), నివాసయోగ్యమైన నగరంగా (లివబుల్ సిటీ) తీర్చిదిద్దుతున్నామని పునరుద్ఘాటించారు. విజయవాడను అమరావతితో అనుసంధానించేలా కృష్ణా నదిపై నిర్మించే బ్రిడ్జిని ఒక ఐకానిక్ సింబల్‌గా నిర్మించాలని ఆదేశించారు. అమరావతిని రాష్ట్రానికి ఒక గ్రోత్ ఇంజన్‌గా మార్చాలని, పెట్టుబడులకు, ఆర్థిక కార్యకలాపాలకు కేంద్రంగా తీర్చిదిద్దాలని సీఎం ఆకాంక్షించారు. ఇందులో భాగంగా ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో బ్యాంకులు, ఆర్థిక సంస్థలకు స్థలాలు కేటాయించాలని, హైరైజ్, ఐకానిక్ భవనాల నిర్మాణానికి ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేయాలని చెప్పారు. నీరు, విద్యుత్, గ్యాస్‌తో పాటు డిస్ట్రిక్ట్ కూలింగ్ వ్యవస్థను కూడా డక్ట్‌ల ద్వారా సరఫరా చేసే ఆధునిక మౌలిక వసతులపై దృష్టి పెట్టాలన్నారు. రాజధాని ఇన్నర్ రింగ్ రోడ్డు నిర్మాణ ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. ఇదే సమావేశంలో సెబీ, స్వామినారాయణ్ గురుకుల్ ఇంటర్నేషనల్ స్కూల్, డీఏవీ పాఠశాల, అగ్నిమాపక శాఖ, ఆప్కాబ్ వంటి పలు సంస్థలకు భూ కేటాయింపులపై మంత్రివర్గ ఉపసంఘం చేసిన సిఫార్సులకు అథారిటీ ఆమోదం తెలిపింది. అంతకుముందు, ప్రతిష్టాత్మక విద్యాసంస్థ బిట్స్ పిలానీ ప్రతినిధులు ముఖ్యమంత్రి చంద్రబాబుతో సమావేశమై అమరావతి క్యాంపస్ నిర్మాణ పురోగతిని వివరించారు. రూ.250 కోట్ల వ్యయంతో మూడు దశల్లో క్యాంపస్ నిర్మిస్తున్నామని, 2027 విద్యా సంవత్సరం నుంచి అడ్మిషన్లు ప్రారంభిస్తామని తెలిపారు. ఈ క్యాంపస్‌లో క్వాంటం, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) విభాగాలను ఏర్పాటు చేస్తున్నట్లు, మొత్తం 10 వేల మంది విద్యార్థులకు విద్యనందించేలా నిర్మాణాలు చేపడుతున్నట్లు వివరించారు. దీనిపై స్పందించిన సీఎం, క్వాంటం టెక్నాలజీ రంగంలో స్టార్టప్‌లను ప్రోత్సహించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ పరిణామాలతో అమరావతి నిర్మాణం తిరిగి పట్టాలెక్కిందని, రైతులకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవడంతో పాటు అభివృద్ధి పనులను వేగవంతం చేయడంపై ప్రభుత్వం దృష్టి సారించిందని స్పష్టమవుతోంది.

# అర్హులైన ప్రతి కౌలు రైతు ధ్రువీకరణ పత్రం దరఖాస్తులు చేసుకోండి

## వ్యవసాయ అధికారి సురేష్ బాబు



**తుగ్గలి ఏప్రిల్ 23 (వజ్ర భారతి న్యూస్):** రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపట్టిన పలు పథకాల ప్రయోజనాలు అందుకోవాలంటే కౌలు రైతులు తప్పనిసరిగా ధ్రువీకరణ పత్రం పొందాలని వ్యవసాయ అధికారి సురేష్ బాబు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ కౌలు రైతులు సమీపంలోని రైతు సేవా కేంద్రాల్లో తమ దరఖాస్తులను వెంటనే సమర్పించాలని సూచించారు.కౌలు రైతులు సాగు చేస్తున్న భూమికి సంబంధించి సరైన ధ్రువీకరణ పత్రం లేకపోతే ప్రభుత్వం అందిస్తున్న ఇన్పుట్ సబ్సిడీలు, పంట బీమా, ఇతర ఆర్థిక సహాయాలు పొందడంలో ఇబ్బందులు ఎదురవుతాయని తెలిపారు. అందువల్ల అర్హులైన ప్రతి కౌలు రైతు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. దరఖాస్తు చేసుకునే సమయంలో రైతులు తమ ఆధార్ కార్డు, భూమి యజమాని ఒప్పంద పత్రం, సాగు వివరాలు వంటి అవసరమైన పత్రాలను సమర్పించాల్సి ఉంటుందని వివరించారు. రైతు సేవా కేంద్రాల్లో సిబ్బంది పూర్తి సహకారం అందిస్తారని, ఎలాంటి సందేహాలు ఉన్నా అక్కడే నివృత్తి చేసుకోవచ్చని తెలిపారు. ప్రభుత్వం కౌలు రైతుల అభ్యున్నతికి కట్టుబడి ఉందని, ధ్రువీకరణ పత్రం ద్వారా వారికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటుందని ఏవో సురేష్ బాబు పేర్కొన్నారు. రైతులు ఆలస్యం చేయకుండా వెంటనే దరఖాస్తు చేసుకుని ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పొందాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# యనమలను పరామర్శించిన పలువురు ప్రముఖులు



**కోటనందూరు,ఏప్రియల్ 23, వజ్రభారతి:** గుండె సంబంధిత శస్త్ర చికిత్స చేయించుకున్న మాజీ ఆర్థిక మంత్రి టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడిని టీడీపీ అగ్రనేతలు పరామర్శిస్తున్నారు.ఇవాళ ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర యనమలను పరామర్శించారు.అనకాపల్లి జిల్లా పర్యటన ముగించుకుని మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి, దామచర్ల సత్యనారాయణలతో కలిసి ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్ర తేటగుంట క్యాంప్ కార్యాలయం చేరుకున్నారు. యనమల ఛాంబర్ కు వెళ్ళిన కొల్లు రవీంద్ర, బండారు సత్యనారాయణమూర్తి, దామచర్ల సత్యనారాయణ తదితరులు యనమలను పరామర్శించి ఆరోగ్య యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈకార్యక్రమంలో తుని మండల టీడీపీ అధ్యక్షుడు చింతంనీడి అబ్బాయి, జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు యినుగంటి సత్యనారాయణ,సీనియర్ నేత పరవాడ తాతబాబు ,పేరూరి కృష్ణ ,పేరూరి గాంధీ,జక్కాన రాము నాయుడు, తమరాన సత్యనారాయణ,తమరాన రామకృష్ణ చామంతి సత్తిబాబు,కోలా కన్నారావు,బొప్పన రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



# చినిమిల్లి కుటుంబాన్ని పరామర్శించిన మురళీకృష్ణం రాజు

**వజ్రభారతి,స్టేట్,బ్యూరో,ఏప్రిల్,23:** భీమవరం పట్టణంలో భీమవరం నియోజకవర్గ ఇంచార్జ్ చినిమిల్లి వెంకటరాయుడు కుటుంబాన్ని నరసాపురం పార్లమెంటు పరిశీలకులు, ప్రత్తిపాడు నియోజకవర్గ వైయస్సార్ సీపీ నాయకులు, ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ముదునూరి మురళీకృష్ణం రాజు పరామర్శించారు.భీమవరం నియోజకవర్గానికి చెందిన ప్రముఖ నాయకుడు చినిమిల్లి వెంకటరాయుడు సోదరుడు చినిమిల్లి రామ వెంకట వీరాస్వామి నాయుడు ఇటీవల అనారోగ్య కారణాలతో మరణించడం ప్రాంత ప్రజలను తీవ్ర విషాదంలోకి నెట్టింది. ఈ దుఃఖ సమయంలో వెంకటరాయుడు కుటుంబానికి అండగా నిలవాలనే ఉద్దేశంతో మురళీకృష్ణం రాజు వారి నివాసానికి చేరుకొని కుటుంబ సభ్యులను పరామర్శించారు.ఈ సందర్భంగా మురళీకృష్ణం రాజు, రామ వెంకట వీరాస్వామి నాయుడు చిత్రపటానికి పుష్పగుచ్ఛం సమర్పించి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులతో మాట్లాడి, వారి దుఃఖాన్ని పంచుకుంటూ ధైర్యం చెప్పారు. ఇలాంటి అపూర్వ నష్టాన్ని భరించడం కష్టమని, అయినప్పటికీ కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని, భగవంతుడు వారికి మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆకాంక్షించారు.మురళీకృష్ణం రాజు మాట్లాడుతూ, రామ వెంకట వీరాస్వామి నాయుడు సమాజంలో మంచి పేరు సంపాదించుకున్న వ్యక్తి అని, ఆయన సేవలు చిరస్మరణీయమని అన్నారు. ఆయన మరణం పార్టీకి మరియు ప్రాంతానికి తీరని లోటని పేర్కొన్నారు. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తూ, వెంకటరాయుడు కుటుంబానికి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున ఎల్లప్పుడూ అండగా ఉంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి మరియు పాలకొల్లు నియోజకవర్గ పరిశీలకులు పేరిచర్ల విజయ నరసింహారాజు, రాష్ట్ర కార్యదర్శి మరియు ఉంగుటూరు నియోజకవర్గ పరిశీలకులు ఎ.ఎస్. రాజు, పార్టీ ముఖ్య నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు మరియు అభిమానులు పాల్గొని, మృతునికి ఘన నివాళులు అర్పించారు. మొత్తంగా ఈ పరామర్శ కార్యక్రమం గంభీర వాతావరణంలో సాగగా, నాయకులు మరియు కార్యకర్తలు కుటుంబ సభ్యులకు తమ సానుభూతిని తెలియజేసి, ధైర్యంగా ఉండాలని సూచించారు.

# ఆడపిల్లల పై వివక్షత పోవాలి ఆమార్పు ఇంటి నుండే మొదలు అవ్వాలి: సిస్టర్ వసుంధర

**వజ్రభారతి,స్టేట్,బ్యూరో,ఏప్రిల్,23:-** గుడ్ షెఫర్డ్ కాన్వెంట్ సిస్టర్స్ చైల్డ్ ప్రొటెక్షన్ ప్రాజెక్ట్ లో భాగంగా సిస్టర్ విద్యా ఆద్వర్యంలో శుక్రవారం తాడేపల్లి మండలం డోలాస్ నగర్ లో ఉన్న దుర్గ భాయ్ కిశోర బాలికల గ్రూప్ సభ్యుల సమావేశంలో సిస్టర్ వసుంధర మాట్లాడుతూ భారత్ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 79 సంవత్సరాలు అయినప్పటికీ ఇంకా చాలా మందిలో ఆడపిల్ల అంటే చిన్న చూపే ప్రభుత్వం ఎప్పటికప్పుడు కట్టినమైన చట్టాలు చేయడం వల్ల కొంతమేర ఊరట లభించిందని ప్రజలందరి భావజాలంలో మార్పు కలగాలి ఆడపిల్ల తక్కువ,మగపిల్లవాడు ఎక్కువ అనే ధోరణిని మార్చుకోవడం,కుటుంబం నుండే లింగ అసమానత తొలగి పోవాలి అంటే స్త్రీ, పురుషులు ఇద్దరూ సమానమే ఇద్దరికీ సమాన హక్కులు,బాధ్యతలు, అవకాశాలు మరియు గౌరవం కల్పించబడాలి,అదే స్థిరమైన అభివృద్ధికి,శాంతియుత సమాజానికి అత్యంత ఆవశ్యకం అని విద్య,ఉపాధి, నిర్ణయాధికారం మరియు వేతనాల్లో లింగ భేదాలు లేకుండా అందరికీ సమాన ప్రాధాన్యత



లభించినప్పుడే దేశంఅభివృద్ధి చెందుతుందని మహిళలకు ఆడపిల్లలకు రక్షణ భరోసా కల్పించే కఠిన చట్టాలు అమలుచేయబడాలి లింగ సమానత్వం గురించి చిన్నతనం నుండి పిల్లల్లో అవగాహన పెంచడం వలనే కొంత కాలానికి మార్పు సాధించగలుగుతాంఅని

లింగ సమానత్వం అనేది స్త్రీ, పురుషులిద్దరి ప్రగతికి, కుటుంబం మరియు దేశాభివృద్ధికి మూలాధారం మా సంస్థ ద్వారావీటి గురించే ఎక్కువగా ప్రజలలో చైతన్యం కల్పిస్తున్నాంఅని అన్నారు. తరువాత అత్తోట పోతురాజు మాట్లాడుతూ లింగ భేదం లేకుండా విద్య, ఉద్యోగం, ఆరోగ్య సంరక్షణ మరియు ఆస్తులపై స్త్రీ పురుషులు ఇద్దరికీ సమాన హక్కులు ఉన్నాయనే భావన అందరిలో కలగాలి,లింగం ఆధారంగా అసమాన ప్రవర్తన,వేధింపులు తొలగి పోవాలి కుటుంబం,సమాజం మరియు రాజకీయాల్లో నిర్ణయాలు తీసుకునే ప్రక్రియలో మహిళలకు సమాన భాగస్వామ్యం కల్పించాలి, మహిళలకు ఆర్థిక వనరులపై నియంత్రణ మరియు సమాన వేతనం పొందడం ఒక హక్కుగా ఉండాలి ప్రజలఅందరిలో తమ లింగ సంబంధిత వైఖరులు మరియు నమ్మకాలను సవరించుకునేలా అవగాహన కల్పించబడాలి ప్రపంచవ్యాప్తంగా దాదాపు 2.4 బిలియన్ల మహిళలకు పురుషులతో సమానమైన ఆర్థిక హక్కులు లేవు అని భారతదేశంలో లింగ సమానత్వ సూచీలో మార్పులు అవసరం,చిన్న దేశాలు సైతం ఈ విషయంలో మెరుగ్గా ఉన్నాయని ఐక్యరాజ్యసమితి సస్టైనబుల్ డెవలప్‌మెంట్ గోల్ ఆధారంగా మహిళల సాధికారత పైదృష్టి పెట్టాలని వారి కొరకు ప్రత్యేక ప్రణాళికలో తయారు చెయ్యాలని సూచించింది అని అన్నారు. ఈకార్యక్రమంలో గ్రామపెద్దలు గుడ్ షెఫర్డ్ స్వచ్ఛంధ సంస్థ సిబ్బంది అత్తోట పోతురాజు పెద్దిపాగ అనీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# పాక్కు ప్యాంట్ తడిచిపోయే వార్నింగ్: ఏడాది తర్వాత మళ్ళీ..

**వజ్రభారతి,స్టేట్,బ్యూరో,ఏప్రిల్,23:-** "మానవత్వం హద్దులు దాటితే.. మా స్పందన అత్యంత కఠినంగా ఉంటుంది. న్యాయం జరిగి తీరుతుంది. భారతదేశం ఎప్పటికీ మర్చిపోదు."- ఇది సరిహద్దులో ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న శత్రువులకు భారత సైన్యం పంపిన తాజా హెచ్చరిక. గతేడాది పహల్గామ్ అడవుల్లో జరిగిన పిరికిపంద ఉగ్రదాడికి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా, భారత సైన్యం తన 'పటిష్ట సంకల్పాన్ని' సోషల్ మీడియా వేదికగా మరోసారి చాటిచెప్పింది. ప్రతీకారం అంటే ఎలా ఉంటుందో చూపించిన 'ఆపరేషన్ సిందూర్' దృశ్యాలను గుర్తు చేస్తూ ఉగ్రవాదుల వెన్నులో వణుకు పుట్టించింది.

**పహల్గామ్ గాయం.. ఆపరేషన్ సిందూర్ మంట!**

సరిగ్గా ఏడాది క్రితం, ఏప్రిల్ 22, 2025న పహల్గామ్లో ఉగ్రవాదులు ఘాతుకానికి ఒడిగట్టారు. అయితే, భారత్ ఈసారి కేవలం ఖండనలతో సరిపెట్టుకోలేదు. దాడి జరిగిన రెండు వారాలకే.. అంటే మే 6-7 తేదీల్లో అర్ధరాత్రి వేళ భారత సైన్యం 'ఆపరేషన్ సిందూర్' పేరుతో ప్రళయంలా




విరుచుకుపడింది. పాక్ ఆక్రమిత కాశ్మీర్ (రాశీఖ) లోని ఉగ్రవాద శిబిరాలపై ఖచ్చితత్వంతో కూడిన దాడులు నిర్వహించి, శత్రువు కోటలను మట్టికరిపించింది.

**100 మంది ఉగ్రవాదుల ఖతం.. పక్కా స్కెచ్!**

'ఆపరేషన్ సిందూర్' భారత సైన్యం యొక్క వ్యూహాత్మక విజయానికి నిదర్శనంగా నిలిచింది. తొమ్మిది ప్రధాన ఉగ్రవాద శిబిరాలను లక్ష్యంగా చేసుకున్న ఈ దాడుల్లో జైషే మహ్మద్, లష్కరే తోయిబా, హిజ్బుల్ ముజాహిదీన్ వంటి సంస్థలకు చెందిన 100 మందికి పైగాఉగ్రవాదులు హతమయ్యారు. ఇందులో కేవలం ఉగ్రవాదులే కాకుండా, వారికి శిక్షణ ఇచ్చే మాస్టర్ మైండ్లు, సూత్రధారులు కూడా ఉండటం గమనార్హం. పౌరులకు ఎటువంటి హాని కలగకుండా, కేవలం ఉగ్రవాద స్థావరాలనే ధ్వంసం చేయడం ద్వారా భారత్ తన సైనిక పటిమను ప్రపంచానికి చాటింది.

**"కొన్ని హద్దులు దాటకూడదు"**

సైన్యం తాజాగా షేర్ చేసిన పోస్ట్లో "కొన్ని హద్దులను ఎప్పటికీ దాటకూడదు" అనే సందేశం పాకిస్థాన్కు నేరుగా ఇచ్చిన వార్నింగ్గా రాజకీయ విశ్లేషకులుభావిస్తున్నారు. పహల్గామ్ దాడికి ప్రతీకారం తీర్చుకున్నా, ఉగ్రవాదంపై పోరులో భారత్ అణుమాత్రం కూడా వెనక్కి తగ్గదని, మరోసారి అలాంటి ప్రయత్నం చేస్తే పరిణామాలు మరింత తీవ్రంగా ఉంటాయని సైన్యం స్పష్టం చేసింది. భారతదేశం ఏకతాటిపై నిలబడి ఉగ్రవాదాన్ని తుదముట్టించే వరకు విశ్రమించదని సైన్యం చేసిన ఈ పోస్ట్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇది కేవలం స్మరణ మాత్రమే కాదు... శత్రువుకు హెచ్చరిక!

# శ్రీ సీతారాముల ఆలయంలో ఘనంగా ప్రతిష్ఠోత్సవాలు

## అన్నదానానికి రూ.10,000 విరాళం అందజేసిన మురళీకృష్ణం రాజు



**వజ్రభారతి,స్టేట్,బ్యూరో,ఏప్రిల్,23:-** ప్రత్తిపాడు మండలం తాడువాయి గ్రామంలోని పురాతన శ్రీ సీతారాములు ఆలయంలో విగ్రహాల ప్రతిష్ఠ, శిఖరకలశ ప్రతిష్ఠ మహోత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో, వైభవంగా నిర్వహించ బడ్డాయి. ఆలయ కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు నరసాపురం పార్లమెంటరీ పరిశీలకులు, ప్రత్తిపాడు నియోజకవర్గ వైయస్సార్ సీపీ ప్రముఖ నాయకులు, ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ముదునూరి మురళీకృష్ణం రాజు ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని మరింత శోభాయమానం చేశారు.ఈ సందర్భంగా ఆయన ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొని, శ్రీ సీతారాముల వారి దివ్య దర్శనం చేసుకున్నారు. పూజల అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తులతో మమేకమై, గ్రామ ప్రజలతో సాన్నిహిత్యంగా మాట్లాడారు. ఆలయ అభివృద్ధి కార్యక్రమాలకు, ముఖ్యంగా అన్నదాన కార్యక్రమం నిరంతరం కొనసాగాలని ఆకాంక్షిస్తూ రూ.10,000 నగదు విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు.ఈ సందర్భంగా మురళీకృష్ణం రాజు మాట్లాడుతూ, గ్రామ దేవాలయాలు గ్రామీణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని, భక్తి భావనను పెంపొందించే కేంద్రాలుగా నిలుస్తాయని తెలిపారు. ఇలాంటి ఆలయాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు. అన్నదానం వంటి సేవా కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను పెంపొందిస్తాయని, పేదలకు ఆహార భద్రత కల్పించే గొప్ప పుణ్యకార్యమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బొవురు వాక గ్రామ సర్పంచ్ దొడ్డి సత్యనారా యణ, వైస్ సర్పంచ్ గెడ్డం వెంకట్ రమణ, పెద్దమల్లాపురం మాజీ సర్పంచ్ పసగొడుగులు నాగేశ్వరరావు, గౌరంపేట సర్పంచ్ రామ్మిశెట్టి ఏసుబాబు, గెడ్డం చిట్టిబాబు, వైయస్సార్ సీపీ నాయకులు గోనగల అజయ్, ఏటంశెట్టి కొండబాబు, సింగంపల్లి సత్యనారాయణ తదితర ప్రముఖులు పాల్గొన్నారు. అలాగే ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మురళీకృష్ణం రాజుకు కృతజ్ఞతలు తెలియజేస్తూ, ఆయన అందించిన విరాళంతో అన్నదాన కార్యక్రమాన్ని మరింత విస్తృతంగా నిర్వహిస్తామని తెలిపారు. గ్రామ ప్రజలు కూడా ఆయన సేవాభావాన్ని అభినందిస్తూ, భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగించాలని కోరారు.



# జీలుగుమిలి పోలీస్ స్టేషన్‌లో హెల్మెట్ల పంపిణీ

### సిబ్బందికి సొంత ఖర్చులతో హెల్మెట్ లు పంపిణీ చేసిన

### ఎస్ఐ వి. క్రాంతికుమార్

**జీలుగుమిల్లి (వజ్రభారతి) ఏలూరు జిల్లా ఇంచార్జ్ ఏప్రిల్23:** జీలుగుమిలి మండల కేంద్రంలో ఎస్ఐ క్రాంతికుమార్ మంచి ఆదర్శంగా నిలిచారు.తమ సిబ్బంది భద్రత కోసం సొంత ఖర్చులతో వేగా కంపెనీ హెల్మెట్‌లను అందజేశారు.జీలుగుమిలి పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న 20 మంది సిబ్బందికి హెల్మెట్‌లు పంపిణీ చేశారు.ప్రతి రోజు డ్యూటీకి వచ్చేటప్పుడు, వెళ్లేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు.రోడ్డు ప్రమాదాల నివారణలో హెల్మెట్ ముఖ్య పాత్ర పోషిస్తుందని తెలిపారు.ముందుగా మనమే పాటిస్తేనే ప్రజలకు అవగాహన కల్పించగలమని అన్నారు. వాహనదారులకు చెప్పే ముందు పోలీసులే నిబంధనలు పాటించాలని సూచించారు.హెల్మెట్ ధరించడం ద్వారా ప్రాణాలను కాపాడుకోవచ్చని వివరించారు.సురక్షిత ప్రయాణం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.పోలీసులు ప్రజలకు ఆదర్శంగా ఉండాలని ఎస్ఐ క్రాంతికుమార్ తెలిపారు.ఈ కార్యక్రమం సిబ్బందిలో భద్రతపై చైతన్యం కలిగించింది.హెల్మెట్ వినియోగంపై మరింత అవగాహన పెంచేందుకు ఇది ఉపయోగపడింది.పోలీసుల ఈ చర్యను స్థానికులు అభినందించారు.రోడ్డు భద్రతపై ఇలాంటి కార్యక్రమాలు అవసరమని ప్రజలు అభిప్రాయపడ్డారు. భవిష్యత్తులో మరిన్ని అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని కోరారు.



## గర్భిణీలు బాలింతలు పోషక సరైన పోషకాహారం తీసుకోవాలి...

**పోడూరు అంగన్వాడీ కేంద్రంలో సిపిడిఓ నాగరత్నం.**

పోడూరు వజ్రభారతి ప్రతినిధి కొట్టి రామం. ఏప్రియల్ 23. గర్భిణీలు బాలింతలు సరైన పోషకాహారం తీసుకోవాలని అంగన్వాడి సిపిడిఓ పి నాగరత్నం సూచించారు మండలంలో అంగన్వాడి కేంద్రాలలో నిర్వహిస్తున్న పోషణ పక్వాడ కార్యక్రమంలో భాగంగా పోడూరు లోని రజకపేట అంగన్వాడి కేంద్రంలో గురువారం ముగింపు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఓ నాగరత్నం మాట్లాడుతూ పోషన్ పక్కవాడ కార్యక్రమంలో ఈ నెల 9 నుండి 23 వరకు ప్రతీ అంగన్వాడి సెంటర్ లోను సచివాలయంల వద్ద లబ్ధిదారులకు అవగాహన కల్పించడం జరిగినదని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాల వద్ద పిల్లలకు సమతుల్య ఆహారము అందించడం జరుగుతున్నదన్నారు. పిల్లలను సెల్ ఫోన్ లకు దూరంగా ఉంచాలన్నారు. శీతలపానీయాలు, చాక్లెట్లు వంటి వాటికి దూరంగా ఉంచడం మంచిదన్నారు. ఈ కారక్రమంలో సూపర్ వైజర్ సుధ, హసీనా, తులసి, మోహన, అంగన్వాడి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మహర్షి భగీరథ కఠోర శ్రమ దీక్ష మరువలేనిది

**మహర్షి భగీరథ జయంతి వేడుకలలో యనమల**



**కోటనందూరు,ఏప్రియల్ 23, వజ్రభారతి:** మహర్షి భగీరథ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి.తుని మండల టీడీపీ అధ్యక్షుడు చింతంనీడి అబ్బాయి అధ్యక్షతన తేటగుంట క్యాంప్ కార్యాలయంలో జరిగిన భగీరథ జయంతి వేడుకలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన మాజీ ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్, జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు యినుగంటి సత్యనారాయణ,నగర కార్పోరేషన్ డైరెక్టర్ ములికి సూరిబాబు లతో కలిసి భగీరథుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగాయనమల మాట్లాడుతూ మహర్షి భగిరథ మహాజ్ఞాని అని, సహనానికి ప్రతిరూపమని పేర్కొన్నారు,భగీరథుని కఠోర శ్రమ,దీక్ష మరువలేమన్నారు.భగీరథునిపట్టుదల దీక్ష నేటి తరానికి తెలియజేయాలన్న సంకల్పంతో కూటమి ప్రభుత్వం భగీరథుని జయంతిని అధికారికంగా జరపడం శుభ పరిణామమన్నారు.

## 24న రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక గ్రామ సభలు

**జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా విస్తృత ఏర్పాట్లు**



**పోలవరం (వజ్ర భారతి) ఏలూరు జిల్లా ఇంచార్జ్ ఏప్రిల్ 23:** జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 24న రాష్ట్రవ్యాప్తంగా గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక గ్రామ సభలు నిర్వహించాలని ఎంపీడీవో సిహెచ్ శ్రీనివాస్ బాబు తెలిపారు .పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతానికి ఈ కార్యక్రమాలు కీలకమని పేర్కొన్నారు.మండల, గ్రామ స్థాయిల్లో సమన్వయంతో కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.గ్రామ సభలను పారదర్శకంగా, పద్ధతిగా నిర్వహించాలని స్పష్టం చేశారు.అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.ప్రజలకు ముందుగానే సమాచారం అందించి విస్తృత హాజరు కల్పించాలని ఆదేశించారు.గ్రామ అభివృద్ధికి సంబంధించిన కీలక అంశాలను సభలో చర్చించాలన్నారు.ప్రజల సమస్యలను స్వీకరించి వెంటనే పరిష్కార దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు.ప్రభుత్వ పథకాల అమలుపై సమీక్ష నిర్వహించాలని పేర్కొన్నారు.గ్రామ స్థాయిలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించడమే ముఖ్య ఉద్దేశమని తెలిపారు.

# ప్రభుత్వాలు మారిన అభివృద్ధి శూన్యం అనడానికి నిదర్శనం

## సిరిపురం జిల్లా పరిషత్ హై స్కూల్ ప్రాంగణం

**వజ్రభారతి,స్టేట్,బ్యూరో,ఏప్రిల్,23:-** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం ఏలేశ్వరం మండలం సిరిపురం గ్రామంలో సుమారు 30 సంవత్సరాల పైబడి కొనసాగుతున్న స్థానిక జిల్లా పరిషత్ హై స్కూల్ నందు కనీస వసతులకి సైతం నోచుకోకపోవడం విద్యార్థిని విద్యార్థుల కి సైతం అంతుచిక్కని సమస్య గా మారింది.

**వివరాల్లోకి వెళితే ...**

స్థానిక హై స్కూల్ నందు గ్రామం లో విద్యార్థిని విద్యార్థులే కాకుండా చుట్టుపక్కల గ్రామాలనుంచి సుమారు 400కు పైబడి స్కూల్ నందు చదువుతున్నారు.. గ్రామంలో డంపింగ్ యార్డ్ లేక స్కూలు ఆవరణ చుట్టూ కుప్పలు తెప్పలుగా చెత్తను వేయడం వల్ల విద్యార్థినీ విద్యార్థుల అనారోగ్యానికి శాపం గా మారుతుంది.. ప్రధానంగా విద్యార్థినుల కు బాత్రూం వ్యవస్థ సరిగా లేకపోవడం వల్ల, అర కోర ఉన్నప్పటికీ శుభ్రత లోపించడం వల్ల విద్యార్థినీ




విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.. టైం కి వచ్చామా... పాఠాలు చెప్పామా జీతాలు తీసుకున్నామా టైం కి వెళ్ళిపోయామ.. అన్నట్లు స్కూల్ వాతావరణాన్ని పట్టించుకోని ఉపాధ్యాయుల వైఖరి ఒకవైపు ఎన్నిసార్లు కంప్లైంట్ ఇచ్చిన సరే పట్టించుకోని అధికారుల వైఖరి మరోవైపు ప్రభుత్వం విద్యార్థినీ విద్యార్థులకు అందించే నాటి అమ్మఒడి నుంచి నేటి తల్లి కి వందనం వరకు ఇచ్చే 15 వేలు కి 2 వేలు ప్రత్యేకించి స్కూల్లో మరమ్మత్తుల కోసంఅని స్కూల్ శుభ్రత కోసం అని తీసుకుంటున్న డబ్బులు ఏమైపోతున్నట్టు.. స్కూలు ఆవరణలో పెట్టిన సిసి కెమెరాలు ఏమయ్యాయి.. అసలు విద్యార్థిని విద్యార్థుల పట్ల శ్రద్ధ వహించని స్కూల్ యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు.. గ్రామంలో ఉన్న చెత్తని అంత తీసుకొచ్చి స్కూల్ ఆవరణలో వేయడం పట్ల పంచాయతీ అధికారుల పనితీరు కళ్లకు కట్టినట్లు కనిపిస్తుంది..

# "కన్ను కొట్టు -- మస్టర్ పట్టు...!"

## ఉపాధి హామీ పథకంలో డిజిటల్ మోసాలు,ఫేక్ ఎంట్రీలు... కొత్త పద్ధతులతో

**తుగ్గలి ఏప్రిల్ 23 (వజ్ర భారతి న్యూస్):** తుగ్గలి మండలంలో ఉపాధి హామీ పథకం అమలుపై కొత్త అనుమానాలు వ్యక్తమవుతున్నాయని ప్రజలు చర్చించుకుంటున్నారు.గ్రామీణ పేదలకు ఉపాధి కల్పించాల్సిన ఈ పథకం,కొందరి చేతుల్లో అక్రమాలకు మార్గంగా మారిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా మస్టర్ రోల్స్ నమోదు,హాజరు వివరాలు, డిజిటల్ రికార్డుల వినియోగంపై ప్రజలు ప్రశ్నలు లేవనెత్తుతున్నారు.గ్రామాల్లో పని చేయని వ్యక్తుల పేర్లు కూడా మస్టర్ రోల్స్‌లో కనిపిస్తున్నాయనే ఆరోపణలు ప్రజల వైపు నుండి ఎక్కువగా వినిపిస్తున్నాయి.ఇతర రాష్ట్రాల్లో లేదా పట్టణాల్లో ఉన్న వ్యక్తుల పేర్లు హాజరు పట్టికల్లో నమోదు చేసి,నిధులు మళ్లిస్తున్నారనే అనుమానాలు ప్రజల్లో చర్చకు దారితీస్తున్నాయి.కొన్ని చోట్ల నిజంగా పని చేసిన కూలీలకు సరైన గుర్తింపు లేకుండా,రికార్డుల్లో వేరే వివరాలు నమోదు అవుతున్నాయనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. డిజిటల్ వ్యవస్థలు పెరిగిన తర్వాత కూడా పారదర్శకత రాకపోవడం ప్రజల్లో అసంతృప్తిని పెంచుతోందని పలువురు మేధావులు తెలియజేస్తున్నారు. జిపిఎస్ ఫోటోలు,మస్టర్ వివరాలు, హాజరు సమయాలు,చెల్లింపుల రికార్డులు ప్రజలకు పూర్తిగా అందుబాటులో ఉంటేనే నిజాలు బయటపడతాయని స్థానిక ప్రజలు అంటున్నారు.ఉపాధి హామీ పథకం పేదల జీవనోపాధి కోసం ఉద్దేశించినదే కాని,అక్రమాలకు వేదిక కాకూడదని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. తుగ్గలి మండలంలో నమోదైన పనులపై సమగ్ర విచారణ చేపట్టి,నిజంగా పని చేసిన కూలీలకు న్యాయం జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.




## వాసవీ మాత జయంతి ఉత్సవాలకు శ్రీకారం



**తాళ్లపూడి, వజ్ర భారతి ఏప్రిల్ 23:** ఆర్య వైశ్యుల ఆరాధ్య దేవత శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి మాత జయంతి ఉత్సవాలకు తాళ్లపూడి లోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయం లో శ్రీకారం చుట్టారు. బయ్యన ఆలయ కమిటీ, ఆర్యవైశ్య ప్రముఖులు సింహాద్రి జనార్ధన రావు మాట్లాడుతూ నాలుగు రోజుల పాటుఈ జయంతి ఉత్సవాలు నిర్వహించ నున్నట్లు తెలిపారు. శుక్రవారం అమ్మవారికి పూజలు జరుగుతాయని శనివారం అమ్మ వారికి గ్రామోత్సవం నిర్వహిస్తామని, ఆదివారం చివరి రోజున అమ్మ వారికి ప్రత్యేక అభిషేకములు, కుంకుమ పూజ, అన్న ప్రసాద వితరణ వుంటాయని అన్నారు. ఆర్యవైశ్యులంతా హాజరై జయంతి వేడుక ను విజయ వంతం చేయాలని కోరారు. గురువారం జయంతి వేడుక ప్రారంభోత్సవం లో ఆలయ శాశ్వత దర్మ కర్తల కుటుంబం నుండి బయ్యన రవిచంద్ర, తమ్మన రాజశేఖర్ దంపతులు పాల్గొని పూజా కార్యక్రమాలు చేపట్టారు.

## పోలవరం ప్రభుత్వ పాఠశాలలో యాన్యువల్ స్పోర్ట్స్ డే

**ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏపీ స్పోర్ట్స్ అథారిటీ డైరెక్టర్ కొవ్వాసు జగదీశ్వరి**



**పోలవరం (వజ్ర భారతి) ఏలూరు జిల్లా ఇంచార్జ్ ఏప్రిల్23:** పోలవరం గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో యాన్యువల్ స్పోర్ట్స్ డే అండ్ కల్చరల్ ప్రోగ్రాం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏపీ స్పోర్ట్స్ అథారిటీ డైరెక్టర్ కొవ్వాసు. జగదీశ్వరి హాజరయ్యారు. విద్యార్థులు క్రీడా పోటీలలో ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. సాంస్కృతిక కార్యక్రమాలు కూడా ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఈ వేడుకల్లో పోలవరం ఎంపీపీ సుంకర. వెంకటరెడ్డి, ఎంపీడీవో సిహెచ్. శ్రీనివాస్ బాబు, తహసిల్దార్ సాయి రాజు, పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు, ఎంఈఓ సత్యనారాయణ, మరియు ఇతర ఉపాధ్యాయులు కూడా హాజరయ్యారు. విద్యార్థుల ప్రతిభను అభినందించిన డైరెక్టర్ వారికి ప్రోత్సాహం అందించారు. క్రీడలు విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి ఎంతో ఉపయోగపడతాయని ఆమె పేర్కొన్నారు.అనంతరం ప్రతిభ కనబరిచి న విద్యార్థులకు సర్టిఫికెట్స్ మరియు మెడల్స్ అందజేశారు.విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ కార్యక్రమాన్ని ఆనందంగా ఆస్వాదించారు.పాఠశాలలో ఉత్సాహభరిత వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.



## జనగణన శిక్షణ పూర్తి

**తాళ్లపూడి, వజ్ర భారతి ఏప్రిల్ 23:** జనగణన శిక్షణా తరగతులు గురువారం తో ముగిశాయి. మండల తహసిల్దార్ మరియు జనగణన తాళ్లపూడి మండల చార్జీ ఆఫీసర్ లావణ్య లక్ష్మీ నేతృత్వం లో మండల ఏ.ఎస్.ఓ సి.ఎచ్. నాయుడు ఆధ్వర్యంలో తాళ్లపూడి మండలం లో మూడు విడతలుగా ఎంపిక చేసిన గణకులకు మూడేసి రోజులు చొప్పున శిక్షణ ఇచ్చారు. మండలం లో 115 మంది కి శిక్షణ అనంతరం క్షేత్ర స్థాయి లో జనగణన పై అవగాహన కల్పించారు. ట్రైనర్ లు రాజు, లక్ష్మీపతి లు రెండు టీమ్ లు గా ఫీల్డ్ లోకి వెళ్లి అవగాహన కల్పించారు.

# హెల్మెట్ ధరించడం తప్పనిసరి : ఎస్ఐ లక్ష్మీకాంతం అవగాహన సదస్సు



**వజ్రభారతి,స్టేట్,బ్యూరో,ఏప్రిల్,23:-** ప్రత్తిపాడు పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో ప్రత్తిపాడు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై ప్రత్యేక అవగాహన సదస్సు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రత్తిపాడు ఎస్ఐ లక్ష్మీకాంతం అధ్యక్షత వహించగా, స్థానిక ప్రజలు, ఆటో డ్రైవర్లు, యువకులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్ఐ లక్ష్మీకాంతం మాట్లాడుతూ, ప్రస్తుత కాలంలో రోడ్డు ప్రమాదాలు అధికంగా పెరుగుతున్నాయని, ముఖ్యంగా హెల్మెట్ ధరించకపోవడం వల్ల తలకు తీవ్రమైన గాయాలు తలెత్తి ప్రాణనష్టం సంభవిస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించడం ద్వారా తన ప్రాణాన్ని కాపాడుకోవడమే కాకుండా, తన కుటుంబ సభ్యులకు భరోసా కల్పించగలడని తెలిపారు. "హెల్మెట్ ఒక చిన్న జాగ్రత్త మాత్రమే కాదు, అది ఒక ప్రాణరక్షక కవచం. మీరు సురక్షితంగా ఉంటేనే మీ కుటుంబం సురక్షితంగా ఉంటుంది" అని ఆయన పేర్కొన్నారు. యువత నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం, ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడం వంటి చర్యలు ప్రమాదాలకు దారి తీస్తాయని హెచ్చరించారు. ఈ అవగాహన కార్యక్రమంలో భాగంగా ఆటో డ్రైవర్లు మరియు ద్విచక్ర వాహనదారులకు ట్రాఫిక్ నియమాలు, రోడ్డు భద్రతా చర్యలు, ప్రమాదాల నివారణ మార్గాలు గురించి వివరంగా తెలియజేశారు. హెల్మెట్ ధరించడం, సీట్ బెల్ట్ వినియోగం, వేగ పరిమితులు పాటించడం వంటి అంశాలపై స్పష్టమైన సూచనలు చేశారు. ఎస్ఐ లక్ష్మీకాంతం హితబోధ చేస్తూ, "మీ మీద ఆధారపడి ఉన్న కుటుంబ సభ్యుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని హెల్మెట్ తప్పనిసరిగా ధరించండి. మీ నిర్లక్ష్యం వల్ల కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి రాకూడదు" అని అన్నారు.

అలాగే ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తూ, హెల్మెట్ లేకుండా వాహనం నడిపితే వెయ్యి రూపాయల జరిమానా విధించబడుతుందని తెలిపారు. మద్యం సేవించి వాహనం నడిపితే 10 వేల రూపాయల వరకు జరిమానా విధించడంతో పాటు చట్టపరమైన చర్యలు కూడా తీసుకుంటామని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా పలువురు ఆటో డ్రైవర్లు మాట్లాడుతూ, ఇలాంటి అవగాహన కార్యక్రమాలు తరచూ నిర్వహిస్తే ప్రజల్లో చైతన్యం పెరుగుతుందని అభిప్రాయపడ్డారు. ప్రజలు కూడా స్వచ్ఛందంగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, పోలీసులకు సహకరించాలని కోరారు.మొత్తంగా ఈ అవగాహన సదస్సు ప్రత్తిపాడు ప్రాంతంలో రోడ్డు భద్రతపై ప్రజల్లో అవగాహన పెంపొందించడంలో ముఖ్యపాత్ర పోషించింది. భవిష్యత్తులో కూడా ఇలాంటి కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించనున్నట్లు పోలీసులు తెలిపారు.



## తాడువాయి గ్రామంలో మురళిరాజు పర్యటన

**శ్రీ రామాలయ విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమంలో ప్రజలతో మమేకమైన మురళి రాజు**

**శంఖవరం వజ్రభారతి ప్రతినిధి. ముఖే.వీరబాబు ఏప్రిల్ :- 23:** ప్రత్తిపాడు మండలం తాడువాయి గ్రామంలో శ్రీ సీతారాములు ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వానం మేరకు శ్రీ రామాలయ విగ్రహాల,శిఖరకలశ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొని శ్రీ సీతారాములు వారి దర్శనం చేసుకొని ఆలయ కమిటీ సభ్యులకు అన్నదానానికి 10,000 /- రూపాయలు విరాళం అందజేసిన లినరసాపురం పార్లమెంటరీ పరిశీలకులు మరియు ప్రత్తిపాడు నియోజకవర్గ వైయస్సార్ సిపి నాయకులు మరియు ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ముదునూరి మురళీకృష్ణం రాజు ఈ కార్యక్రమంలో బౌవురువాక గ్రామ సర్పంచ్ దొడ్డి సత్యనారాయణ , మాజీ జెడ్పిటిసి ఈగల అప్పారావు వైస్ సర్పంచ్ గెద్దం వెంకట్ రమణ ,పెద్దమల్లాపురం మాజీ సర్పంచ్ పసగొడుగులు నాగేశ్వరరావు ,గౌరంపేట సర్పంచ్ రామ్మిశెట్టి ఏసుబాబు ,గెద్దం చిట్టిబాబు ,వైస్సార్సీపీ నాయకులు గోనగల అజయ్ ,ఏటంశెట్టి కొండబాబు ,సింగంపల్లి సత్యనారాయణ ఆలయ కమిటీ సభ్యులు, తాడువాయి గ్రామ ప్రజలు,ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు

## తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పత్రికా సమావేశం

**గిరిజనులపై దాడులపై మంత్రివర్యులు సంధ్యారాణి తీవ్ర వ్యాఖ్యలు**

**రాష్ట్ర ఎస్టీ సెల్ ఉపాధ్యక్షులు బి. విజయ్ నాయక్**




**పోలవరం (వజ్ర భారతి) ఏలూరు జిల్లా ఇంచార్జ్ ఏప్రిల్23:** తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో గిరిజన మరియు శిశు సంరక్షణ శాఖ మంత్రివర్యులు గుమ్మడి సంధ్యారాణి సమక్షంలో పత్రికా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర ఎస్టీ సెల్ ఉపాధ్యక్షులు బి. విజయ్ నాయక్ పాల్గొన్నారు.గత ప్రభుత్వ కాలంలో గిరిజనులపై జరిగిన దాడులను మంత్రివర్యులు వివరించారు.మావిగన్ అంశంపై కూడా స్పష్టమైన వివరణ ఇచ్చారు.గిరిజనుల హక్కులను నిర్లక్ష్యం చేసిన ఘటనలను ఆమె తీవ్రంగా ఖండించారు.దళితులపై జరిగిన అన్యాయాలను కూడా ప్రస్తావించారు.దళితులకు ద్రోహం చేసిన వ్యక్తిగా అనంతబాబును ఆమె విమర్శించారు.ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు.గిరిజనుల రక్షణకు కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు.ప్రభుత్వం సామాజిక న్యాయానికి ప్రాధాన్యం ఇస్తుందని వెల్లడించారు. ఈ పత్రికా సమావేశం రాజకీయంగా ప్రాధాన్యతను సంతరించుకుంది.

## నాదెండ్ల భాస్కరరావుకు ఘన నివాళి

**ఎంపీ పుట్టా మహేష్ కుమార్ సంతాపం వ్యక్తం**



**ఏలూరు (వజ్ర భారతి) ఏప్రిల్ 23 :** అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మరణించిన మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కరరావుకు ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ఘనంగా నివాళులు అర్పించారు. గురువారం ఉదయం జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసానికి చేరుకున్న ఎంపీ, భాస్కరరావు పార్థివ దేహంపై పుష్పగుచ్ఛం ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను స్మరించుకుని గౌరవ నివాళులు అర్పించారు. అనంతరం భాస్కరరావు కుమారుడు, ఏపీ పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను కలిసి పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.భాస్కరరావు మరణం రాష్ట్రానికి తీరని లోటని పేర్కొన్నారు. ఆయన రాజకీయ జీవితం ప్రజాసేవకు అంకితం అయిందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# 1950 రాష్ట్రపతి ఉత్తర్వు.. దళిత క్రైస్తవుల సామాజిక, న్యాయపరమైన సవాళ్ళు...: కోనాల భీమారావు

భారత రాజ్యాంగం ఆర్టికల్ 14 ప్రకారం చట్టం ముందు అందరూ సమానులే. ఆర్టికల్ 15 మతం, కులం, జాతి ప్రాతిపదికన వివక్షను నిషేధిస్తోంది. కానీ, 1950 ఆగస్టు 10న వెలువడిన 'రాష్ట్రపతి ఉత్తర్వు (ప్రెసిడెన్షియల్ ఆర్డర్)' లోని 3వ పేరా, రాజ్యాంగం ఆశించిన ఈ సమానత్వ స్ఫూర్తికి విరుద్ధంగా వుంది.1950 ఉత్తర్వు

రిజర్వేషన్లు కోల్పోయి విద్యా, ఉద్యోగ రంగాల్లో వెనుకబడిపోతున్నారు.

- సిక్కు, బౌద్ధులకు వర్తించినప్పుడు క్రైస్తవులకు ఎందుకు వర్తించదు?
- సిక్కు,బౌద్ధ మతాలను స్వీకరించిన దళితులకు ఎస్సీ హోదా కొనసాగుతున్నప్పుడు క్రైస్తవ దళితులకు ఎందుకు నిరాకరిస్తున్నారు?
- హిందూ, సిక్కు, బౌద్ధ మతాలలోని ఎస్సీలు

ప్రెసిడెన్షియల్ ఆర్డర్ ద్వారా జరిగిన చారిత్రక తప్పిదాన్ని సరిదిద్దడమే న్యాయం. ఒక వ్యక్తి మతం మారినంత మాత్రాన అతని పుట్టుకతో వచ్చిన కుల వివక్ష పోనప్పుడు రిజర్వేషన్ ఫలాలు ఎందుకు ఆగిపోవాలి??దళిత క్రైస్తవులు ఇప్పుడు తమ హక్కుల కోసం ఐక్యంగా పోరాడాల్సిన సమయం ఆసన్నమైంది.

- దళిత క్రైస్తవ సమాజం తమకు జరుగుతున్న

- ప్రారంభంలో ఈ ఉత్తర్వు ప్రకారం 'హిందూ' మతానికి చెందిన వారిని మాత్రమే షెడ్యూల్డ్ కులాలు (ఎస్.సి) గా గుర్తించారు. ఆ తర్వాత 1956లో సిక్కులను, 1990లో బౌద్ధులను ఈ జాబితాలో చేర్చారు. అయితే, క్రైస్తవ, ఇస్లాం మతాల్లోకి మారిన దళితులను మాత్రం ఈ జాబితా నుండి మినహాయించారు. ఇది కేవలం మత ప్రాతిపదికన జరుగుతున్న వివక్షే తప్ప మరొకటి కాదు.

**మతం మారినంత మాత్రాన సామాజిక హోదా మారుతుందా?**

- దళితులు క్రైస్తవ మతం స్వీకరించడానికి ప్రధాన కారణం సామాజిక గౌరవం మరియు సమానత్వం. కానీ మతం మారినంత మాత్రాన వారు ఎదుర్కొంటున్న 'అస్పృశ్యత' అనే సామాజిక కళంకం చెరిగిపోలేదు. గ్రామీణ ప్రాంతాల్లో దళిత క్రైస్తవులు ఇప్పటికీ దళితులుగానే పరిగణించబడుతున్నారు. అవే సామాజిక ఆంక్షలను ఎదుర్కొంటున్నారు. వారి ఆర్థిక స్థితిగతుల్లో కానీ జీవన ప్రమాణాల్లో కానీ చెప్పుకోదగ్గ మార్పు రాలేదు. కేవలం మతం మారారనే సాకుతో వారిని బి.సి-సి కేటగిరీలో చేర్చడం వలన వారు రాజ్యాంగబద్ధంగా రావాల్సిన



పొందుతున్న ఫలాలు కేవలం మతం కారణంగా క్రైస్తవ దళితులకు అందడం లేదు.

- దళిత క్రైస్తవులకు రావాల్సిన వాటాను కూడా ఇతర మతాల్లోని ఎస్సీలే పొందుతున్నారు. ఇది సమాన పంపిణీ సూత్రానికి విరుద్ధం.?దళిత క్రైస్తవులను ఎస్సీ జాబితాలో చేర్చితే ప్రస్తుత ఎస్సీలకు అన్యాయం జరుగుతుందనే వాదనలో హేతుబద్ధత లేదు. ఇది వర్గాల మధ్య చిచ్చు పెట్టే వాదనే తప్ప న్యాయబద్ధమైనది కాదు. నిజానికి 1950

రాజ్యాంగ ఉల్లంఘనపై పూర్తి అవగాహన పెంచుకోవాలి.

- సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్న పిటిషన్లపై ఒత్తిడి తీసుకురావాలి. రంగనాథ్ మిశ్రా కమిషన్ నివేదిక వంటి సానుకూల అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి.
- ఓటు బ్యాంకు రాజకీయాలకు అతీతంగా తమ హక్కులను గుర్తించే శక్తులకు మద్దతునిస్తూనే ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావాలి.
- దళిత క్రైస్తవుల సమస్య కేవలం మతానికి సంబంధించినది కాదు ఇది మానవ హక్కులకు మరియు సామాజిక న్యాయానికి సంబంధించిన అంశం. 1950 ప్రెసిడెన్షియల్ ఆర్డర్‌లోని 3వ పేరాను రద్దు చేయడం లేదా సవరించడం ద్వారా మాత్రమే దళిత క్రైస్తవులకు నిజమైన న్యాయం జరుగుతుంది.భారత రాజ్యాంగం 14,15 అధికరణంల ప్రకారం చట్టం ముందు అందరూ సమానమేనని..మతం, కులం,జాతి ప్రాతిపదికన వివక్ష తొలగి రాజ్యాంగ స్ఫూర్తి నెరవేరుతుంది.

**కోనాల భీమారావు,**
**ఫ్రీలాన్స్ జర్నలిస్ట్**
**సెల్:9705557367**

## అంగన్వాడీలకు కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలి



**ప్రత్తిపాడులోని అంగన్వాడీలు ర్యాలీ**



**వజ్రభారతి,స్టేట్,బ్యూరో,ఏప్రిల్,23:** అంగన్వాడీలకు కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని నియోజకవర్గ స్థాయిలో ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ వద్ద నిరసన తెలియజేసి వినతి పత్రం ఇవ్వాలని ఎ.పి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపులోని భాగంగా గురువారం స్థానిక ఫైర్ ఆఫీస్ నుండి ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ వరకు ర్యాలీ నిర్వహించి నిరసన తెలియజేయడం జరిగింది.ఈ నిరసన కార్యక్రమాన్ని ఉద్దేశించి సిఐటియు జిల్లా కార్యదర్శి రొంగల ఈశ్వరరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు గత వైసిపి ప్రభుత్వం మినిట్సుని కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అమలు చేస్తామని హామీని రెండు సంవత్సరాలు పూర్తవుతున్న ఇప్పటికీ ఈ హామీలు అమలు చేయకపోవడం అన్యాయం అన్నారు .2014 నుండి ఈనాటి వరకు కార్మికులకు వేతనాలు పెరగలేదని ధరలు ఆకాశానికి అంటాయని ఈ సందర్భంగా గుర్తు చేశారు. అంగనవాడీలకు ప్రభుత్వం వేతనాలు పెంచుతామని తెలంగాణ కమిటీ అదనంగా ఇస్తామని ఇచ్చిన హామీను తక్షణమే నెరవేర్చాలని, అలాగే సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు చట్టప్రకారం గ్రాడ్యుటీ అమలు చేసే విధంగా గైడెన్స్ రూపొందించి అమలు చేయాలని ఈ సందర్భం గా అన్నారు. ప్రస్తుతం ఎండలు తీవ్రంగా ఉండడం కారణంగా అంగన్వాడీ సెంటర్లో పిల్లలకు ఈ మండుటల్లో ఇళ్లకు చేరుకోవడం వలన వడదెబ్బకు తగడంవలన అనారోగ్యానికి పాలవుతారని కావున అంగన్వాడీ సెంటర్లకు మే నెల అంతా సెలవులు ఇవ్వాలని ఈ సందర్భంగా అన్నారు .మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లగా స జీవోను విడుదల చేయాలని తదితర డిమాండ్లు పరిష్కారం కోసం కార్మికులు రావడం జరిగిందని సందర్భంగా అన్నారు .తక్షణమే ప్రభుత్వం అంగన్వాడీలు సమస్యలు పరిష్కరించాలని అన్నారు.అనంతరం ఎమ్మెల్యే అందుబాటులో లేకపోవడంతో స్థానిక నాయకులు యాళ్ళ జగదీష్ కి అంగన్వాడీలు వినతిపత్రం ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ప్రత్తిపాడు, శంఖవరం ప్రాజెక్టు నాయకులు అల్లాడి లక్ష్మీ, జి.బుల్లమ్మ, కె.హేమలత, టి.నాగసత్యవతి, ఎన్.అమలావతి, టి.చక్రకాంతం,కె.అచ్చిరాజు,పి.డి.ఎస్.కుమారి, బి.రత్న కుమారి,బి.సత్యవేణి,కె.నూకరత్నం, బి.వరలక్ష్మి,బి.రత్నం తదితరులు పాల్గొన్నారు.

## వేసవి సెలవులకు ఊరెళితే పోలీసులకు సమాచారం ఇవ్వండి --- జగ్గంపేట ఎస్ఐ టి.రఘునాథరావు



**జగ్గంపేట,వజ్రభారతి,ప్రతినిధి, జగ్గంపేట నియోజకవర్గ ఇంచార్జ్, ఏప్రిల్, 23:-** వేసవి సెలవులకు కుటుంబ సమేతంగా ఇళ్లకు తాళాలు వేసి ఇతర ప్రాంతాలకు ఊరెళితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని జగ్గంపేట ఎస్సై టి.రఘునాథరావు పేర్కొన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ వేసవికాలంలో పిల్లలకు స్కూల్స్ సెలవు కారణంగా కుటుంబ సభ్యులంతా ఎక్కడకైనా ఊరెళ్లే సందర్భం ఉంటే నగదు, బంగారం ఇతర విలువైన వస్తువులు ఇళ్లల్లో ఉంచుకోకుండా బ్యాంకు లాకర్ లో దాచుకోవాలన్నారు. ఎక్కువ రోజులు ఊరులో ఉండనట్లయితే పోలీసులకు సమాచారం ఇస్తే గస్తీ పెంచుతామన్నారు.వేసవికాలంలో దొంగతనాలు ఎక్కువగా జరిగే అవకాశం ఉన్న దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇప్పటికే రాత్రి సమయాల్లో పోలీసు గస్తీ పెంచామన్నారు. జగ్గంపేట చుట్టుపక్కల పరిధిలో సిసి కెమెరాలతో ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. ఆటోలు, బస్సుల్లో ప్రయాణించేటప్పుడు బంగారం, నగదు ఇతర విలువైన వస్తువులు వెంట ఉంచుకోవద్దని ఒకవేళ తప్పనిసరిగా అయితే జాగ్రత్తగా ఉండాలని సూచించారు. గ్రామాల్లో అనుమానాస్పదంగా ఎవరైనా తిరిగితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ రఘునాథరావు తెలిపారు.పాదాలమ్మ తీర్థం పార్టీల చేరలో.. జరిగేనా

## పెళ్లిరోజు సందర్భంగా కొమరవెల్లి మల్లన్న స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు

**మాదారం మాజీ సర్పంచ్ సరిత సురేందర్ గౌడ్ దంపతులు**

**కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు ప్రజల శ్రేయస్సు కోసం ప్రార్థనలు**



**పటాన్చెరు నియోజకవర్గం వజ్రభారతి న్యూస్ ఏప్రిల్ 23 రిపోర్టర్:(జింక గణేష్):** పటాన్చెరు నియోజకవర్గం జిన్నారం మున్సిపాలిటీ పరిధిలోని మాదారం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ సరిత సురేందర్ గౌడ్ దంపతులు తమ వివాహ వార్షికోత్సవాన్ని భక్తి భావంతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు కుటుంబ సభ్యులతో కలిసి శ్రీ శ్రీ కొమురవెల్లి మల్లన్న స్వామి ఆలయాన్ని సందర్శించారు.ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, కుటుంబ సభ్యుల ఆరోగ్యం, ఆయుష్షు శ్రేయస్సు కోసం ప్రార్థనలు చేశారు. ఈ సందర్శనం వారికి ఆధ్యాత్మిక ఆనందాన్ని కలిగించిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, సన్నిహితులు పాల్గొని దంపతులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

# అంగన్వాడీలకు వేతనాల పెంపు కోరుతూ వినతి

**మే నెలకు పూర్తిస్థాయి సెలవులు మంజూరు చేయాలని డిమాండ్**

**ఎమ్మెల్యే చిర్రి బాలరాజు కు వినతి పత్రం**

**జీలుగుమిల్లి (వజ్రభారతి) ఏలూరు జిల్లా ఇంచార్జ్ ఏప్రిల్23:** జీలుగుమిలి మండలం బర్రింకలపాడు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు, మినీ వర్కర్లు తమ సమస్యల పరిష్కారం కోసం పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజును కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, 2019 సంవత్సరం నుంచి ఇప్పటివరకు వేతనాల్లో ఎలాంటి పెంపు జరగలేదని, ఇదే సమయంలో నిత్యావసర వస్తువుల ధరలు పెరగడంతో కుటుంబాల నిర్వహణ కష్టంగా మారిందని తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పేర్కొంటూ, తక్షణమే వేతనాలను పెంచాలని ఎమ్మెల్యే ద్వారా ప్రభుత్వాన్ని కోరారు. అలాగే ఎండల తీవ్రత అధికంగా ఉండటంతో అంగన్వాడీ కేంద్రాలకు చిన్నారులు హాజరుకావడం కష్టమవుతోందని తెలిపారు. ఈ నేపథ్యంలో మే నెల మొత్తం వేసవి సెలవులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ రెండు ప్రధాన డిమాండ్లపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే చిర్రి బాలరాజును కోరారు. ఈ




విషయాలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి తగిన పరిష్కారం కోసం కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి చిట్టి బొమ్మ కొండలరావు, ప్రాజెక్ట్ లీడర్ కే పుష్ప, రామలక్ష్మి, నాగమణి, సుజాత, సుధారాణి, భూదేవి తదితరులు పాల్గొన్నారు.



## 26వ తేదీన అధికారికంగా వాసవి కన్యకా పరమేశ్వరి జయంతి

### తోపాజి అనంత కిషన్ వాసవి మహా సంస్థాన్ చైర్మన్

**సంగారెడ్డి జిల్లా వజ్రభారతి న్యూస్ ఏప్రిల్ 23 రాష్ట్ర బ్యూరో (డా.ఏర్పుల శ్రీనివాస్):** వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం హర్షనీయమని ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, వాసవి మహా సంస్థాన్ చైర్మన్ తోపాజి అనంత కిషన్ తెలిపారు. వాసవి మహా సంస్థాన్ పాలకవర్గ సమావేశం గురువారం ఆర్యవైశ్య భవనంలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 26వ తేదీన ఉదయం 10 గంటలకు ప్రభుత్వ అతిథిగం వద్ద ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పాలాభిషేకం జరుగుతుందని పేర్కొన్నారు.అనంతరం కలెక్టర్ కార్యాలయం వరకు బైక్ ర్యాలీ నిర్వహిస్తామని చెప్పారు.కలెక్టర్ కార్యాలయం ఆడిటోరియంలో అధికారికంగా నిర్వహించి వాసవి కన్యకా పరమేశ్వరి జయంతి కార్యక్రమంలో ఆర్యవైశ్యులు ప్రజలు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఈల్లింతల రాజు,కోశాధికారి జూలకంటి మల్లేశం,కార్య నిర్వాహక కార్యదర్శి కొంపల్లి విద్యాసాగర్,ఉపాధ్యక్షుడు ఆమెటి మహేందర్ సభ్యులు పాల్గొన్నారు.

## నేటి ప్రజావాణిని సద్వినియోగం చేసుకోండి

### జిల్లా ఎస్పీ జానకీ షర్మిళ



**భైంసా వజ్రభారతి న్యూస్ ఏప్రిల్ 23 జిల్లా స్టాఫ్ రిపోర్టర్:** నిర్మల్ జిల్లా భైంసా కేంద్రంలోని జరగవలసిన ప్రజావాణి ఏప్రిల్ 24 న నిర్వహిస్తున్నట్టు నిర్మల్ జిల్లా ఎస్పీ జానకీ షర్మిళ తెలిపారు.అనివార్య కారణాల వల్ల గతంలో వాయిదా పడిన భైంసా ప్రజావాణి కార్యక్రమం ఏప్రిల్ 24న భైంసా క్యాంపు కార్యాలయంలో యథావిధిగా నిర్వహించనున్నట్లు అధికారులు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ జి. జానకి షర్మిల ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులను స్వీకరించనున్నారు.గతంలో ఈ కార్యక్రమం బుధవారం జరగాల్సి ఉండగా,కొన్ని అనివార్య కారణాల వల్ల వాయిదా పడింది.ప్రజావాణికి హాజరుకావాలనుకునే ఫిర్యాదుదారులు ఈ మార్పును గమనించి, కార్యక్రమానికి హాజరుకావాలని అధికారులు సూచించారు.

## అమీన్పూర్ ది నెస్ట్ వృద్ధాశ్రమం ఆకస్మిక తనకి

### వృద్ధుల పట్ల కన్న పిల్లలు అలసత్వం వహిస్తే చట్టరీత్య శిక్ష అర్హులు

### న్యాయమూర్తి బి.సౌజన్య జిల్లా కార్యదర్శి... న్యాయ సేవ అధికార సంస్థ సంగారెడ్డి





**సంగారెడ్డి జిల్లా వజ్రభారతి న్యూస్ ఏప్రిల్23 రాష్ట్ర బ్యూరో (డా.ఏర్పుల శ్రీనివాస్):** జాతీయ న్యాయ సేవాధికార సంస్థ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ హైదరాబాద్ ఆదేశాల ప్రకారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆదేశాల ప్రకారం జిల్లా న్యాయ సేవ్షధికార సంస్థ కార్యదర్శి న్యాయమూర్తి బి.సౌజన్య, అమీన్పూర్ లోని ది నెక్ట్ వృద్ధాశ్రమాన్ని ఆకస్మికంగా తనిఖీ నిర్వహించడం జరిగింది. జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి బి.సౌజన్య వృద్ధాశ్రమాన్ని పర్యవేక్షించి ఆశ్రమంలో ఉన్న గదులు, వంట గది, బాత్రూంలు మౌలిక సదుపాయాలు, వృద్ధాశ్రమం ఆవరణ స్థితిగతులు మొత్తం తిరిగి పరిశీలించి ఈ సందర్భంగా న్యాయమూర్తి బి.సౌజన్య మాట్లాడుతూ వృద్ధులకు అందుతున్న సదుపాయాలను, భోజనం గూర్చి అడిగి తెలుసుకున్నారు. వృద్ధుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని వారికి సకాలంలో వైద్య సేవలను అందించాలని వృద్ధాశ్రమ నిర్వాహకులకు సూచించారు, ప్రతి ఒక్కరు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు, వృద్ధుల పట్ల వారు కన్న పిల్లలు బాధ్యతయుతంగా చూసుకోవాలని లేనియెడల చట్టరీత్యా తగు చర్య తీసుకుని వారు సంపాదించిన స్థిర చర ఆస్తులను చట్టబద్ధంగా తిరిగి వారికే స్వాధీన పరచబడతాయని అన్నారు, న్యాయపరమైన విషయాలలో ఉచిత న్యాయ సహాయం అందిస్తామని ఏదైనా న్యాయ సహాయం కోరినచో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, సంగారెడ్డి కార్యాలయలను సంప్రదించగలరుఅని. న్యాయ సేవాధికార సంస్థ యొక్క టోల్ ఫ్రీ నెంబర్ 15100 నందు కూడా ఫిర్యాదు చేయవచ్చు అన్నారు.వృద్ధాశ్రమం పరివేక్షణలో భాగంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.సౌజన్య తో పాటు,ది నెస్ట్ వృద్ధాశ్రమం సిబ్బంది లీగల్ సర్వీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కానుకుంట గ్రామంలో నిర్వహించిన పోషణ్ పక్వార్డు కార్యక్రమం

## విద్యార్థులకు పోషక విలువలు కల పౌష్టికాహారం అందించాలి: సిసి వరలక్ష్మి





**గుమ్మడిదల మున్సిపల్ వజ్ర భారతి న్యూస్ ఏప్రిల్ 23 రాష్ట్ర బ్యూరో (డా.ఏర్పుల శ్రీనివాస్):** సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మున్సిపల్ కానుకుంట గ్రామంలో అంగన్వాడీ కేంద్రంలో పోషన్ పక్వర్డ్ లో భాగంగా కానుకుంట 2 అంగన్వాడీ లో విద్యార్థుల తల్లులతో టీచర్ బాలక్ష్మి, నేతృత్వంలో సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఇంద్ర కాంతి పథకం సిసి వరలక్ష్మి విచ్చేసి అంగన్వాడీలో చదువుకుంటున్నటువంటి చిన్నారి పిల్లల్ని పలకరించి వారి యోగక్షేమాలు కనుక్కోవడం జరిగింది, అనంతరం అంగన్వాడి విద్యార్థుల తల్లుల తో మాట్లాడుతూ చిన్న పిల్లలకు పౌష్టికాహారం అదేవిధంగా నిత్యజీవితంలో నిత్యం సహజంగా దొరికే ఆకుకూరలు పండ్లు పాలు గ్రుడ్లు చేపలు ఆర్గానిక్ పప్పు ధాన్యాలు పిల్లలకు పెట్టాలని తద్వారా పిల్లల మానసిక పరిపక్వతతో శారీరక దృఢత్వంతో ఆరోగ్యంగా ఉండడానికి ఆస్కారం ఉంటుంది అన్నారు, అదేవిధంగా చిన్నపిల్లలకు సెల్ ఫోన్లు ఇవ్వడం ప్రమాదకరం వాటి వల్ల అధిక రేడియేషన్ తో పిల్లల ఆరోగ్యం దెబ్బతినే ప్రమాదం ఉంది, కంటి చూపు మందలించే ప్రమాదం ఉంది, సెల్ఫోన్ ద్వారా పిల్లల ఆలోచనలు విద్యపై ఆసక్తి చూపే విషయంలో ప్రమాదం ఉంది కనుక చిన్నపిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధను చూపి వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలని తెలియజేయడం జరిగింది, ఈ కార్యక్రమంలో వి.వో.ఏ. కల్పన, మహేశ్వరి, అంగన్వాడి టీచర్, మహిళా సంఘాల సభ్యులు విద్యార్థుల తల్లులు పాల్గొనడం జరిగింది.

# కాలేశ్వరం తీర్పుతో నిజం వెలుగులోకి టీఆర్ఎస్ నేత వి.ఆదర్శ్ రెడ్డి

## పీసీ ఘోష్ నివేదికపై హైకోర్టు స్టే ప్రభుత్వానికి చెంపపెట్టు.. రైతు సమస్యలపై దృష్టి పెట్టాలి సీఎం రేవంత్ రెడ్డికి డిమాండ్



**పటాన్చెరు నియోజకవర్గం వజ్ర భారతి న్యూస్ ఏప్రిల్ 23 రాష్ట్ర బ్యూరో (డా.ఏర్పుల శ్రీనివాస్):** పటాన్‌చెరు నియోజకవర్గం టౌన్ ఇన్స్పెక్షన్ బంగ్లాలో బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ ఆదర్శ్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రెస్ మీట్‌లో కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తాజా తీర్పును స్వాగతించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,పీసీ ఘోష్ కమిషన్ నివేదికపై హైకోర్టు స్టే విధించడం,ఆ నివేదిక ఆధారంగా ఎలాంటి చర్యలు తీసుకోవద్దని ఆదేశించడం ప్రభుత్వం చేపట్టిన రాజకీయ కక్షసాధింపులకుగట్టిచెంపపెట్టుగా నిలిచిందన్నారు. ఆ నివేదిక వాస్తవాలను ప్రతిబింబించకుండా రాజకీయ ఉద్దేశాలతో రూపొందించబడిందని విమర్శించారు. గత మూడు సంవత్సరాలుగా కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై చేసిన ఆరోపణలు న్యాయస్థానం ముందుబట్టబయలయ్యాయని పేర్కొంటూ, రైతులకు నీరు అందించాల్సిన ప్రభుత్వం ప్రాజెక్ట్‌ను నిర్లక్ష్యం చేసి రైతులను ఇబ్బందులకు గురిచేసిందని అన్నారు. అలాగే ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలుపై దృష్టి సారించాలని, రైతు బంధు, రైతు భీమా పథకాలను సమర్థంగా కొనసాగించాలని సూచించారు.రాష్ట్రంలో ప్రజాపాలనకు ప్రాధాన్యం ఇవ్వాలని,ఆర్టీసీ సమ్మె కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, మక్కల కొనుగోలు కేంద్రాలను అన్ని ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇకనైనా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాజకీయాలు పక్కనపెట్టి రైతులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పటాన్‌చెరు మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్,మాజీ జెడ్పీటీసీ శ్రీకాంత్ గౌడ్, జిన్నారం మాజీ జెడ్పీటీసీ కొలాను బాల్‌రెడ్డి, రామచంద్రాపురం మాజీ కార్పొరేటర్ తొంట అంజయ్య యాదవ్, బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు ఐలాపూర్ మాణిక్ యాదవ్, కౌన్సిలర్లు నవీన్ కుమార్,సురేష్,సతీష్, రవీందర్,మాజీ కౌన్సిలర్ రవీందర్ రెడ్డి,బీఆర్ఎస్ యువ నాయకులు పృథ్వీరాజ్,మాణిక్ యాదవ్, సర్కిల్ ప్రెసిడెంట్ పరమేష్ యాదవ్, డివిజన్ ప్రెసిడెంట్ బూన్,సీనియర్ నాయకులు ప్రకాశ్ చారి,జగన్నాథ్ రెడ్డి, గణేష్,మాజీ సర్పంచ్ ఖాదిర్ తదితరులు పాల్గొన్నారు.

## రాళ్లకత్వ పాఠశాలలో విద్యార్థులకు ప్రతిభకు గోల్డ్ మెడల్స్‌తో ఘన సత్కారం

### గ్రామ ప్రముఖుల సమక్షంలో మెరిసిన చిన్నారుల ప్రతిభ



**పటాన్చెరు నియోజకవర్గం వజ్రభారతి న్యూస్ ఏప్రిల్ 23 రిపోర్టర్:(జింక గణేష్):** సంగారెడ్డి జిల్లా పటాన్చెరు నియోజకవర్గంలోని జిన్నారం మున్సిపాలిటీ పరిధిలోని రాళ్లకత్వ ఉన్నత ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల ప్రతిభను ఘనంగా సత్కరించారు. ఫైనల్ పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ప్రత్యేకంగా బహుమతులు అందజేస్తూ కార్యక్రమం నిర్వహించడం విశేషం.ఈ సందర్భంగా ఆది రామకృష్ణ, రాయిని బాలేష్, రాయిని మహేష్, ఒగ్గు నర్సింలు ఆధ్వర్యంలో 1వ తరగతి నుండి 5వ తరగతి వరకు ఫస్ట్,సెకండ్ స్థానాలు సాధించిన విద్యార్థులకు గోల్డ్ మెడల్స్ మెమొంటోలు అందజేశారు. చిన్నారుల ఆనందానికి అవధులు లేకుండా ఈ కార్యక్రమం స్ఫూర్తిదాయకంగా నిలిచింది.కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు సులోచన, ఉపాధ్యాయురాలు రేణుక,స్థానిక 20వ వార్డు కౌన్సిలర్ ఆది గీత రామకృష్ణ, గ్రామ యువకులు తదితరులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.ఈ సందర్భంగా ఆది రామకృష్ణ, రాయిని బాలేష్, మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు ఇతర రంగాల్లో కూడా ముందుండాలని, సమగ్ర అభివృద్ధి సాధించాలని సూచించారు.అలాగే పాఠశాలలో కాంపౌండ్ వాల్ లేకపోవడం వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని స్థానిక కౌన్సిలర్ ఆది గీత రామకృష్ణ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన కౌన్సిలర్, సంబంధిత అధికారులతో మాట్లాడి ఎంఈఓ, డీఈఓలకు వినతిపత్రం అందజేసి త్వరలోనే కాంపౌండ్ వాల్ శాంక్షన్ అయ్యేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమం గ్రామంలో విద్యా ప్రాధాన్యతను మరోసారి చాటుతూ, విద్యార్థుల్లో ఉత్తేజాన్ని నింపిన సందర్భంగా నిలిచింది.

## మోదీ పథకాలపై ఆకర్షితుడై బీజేపీలోకి బాలు

### ఆరేటి ఏసుబాబు నేతృత్వంలో చేరిక కార్యక్రమం

**జీలుగుమిల్లి (వజ్రభారతి) ఏలూరు జిల్లా ఇంచార్జ్ ఏప్రిల్ 23:** జిల్లా అధ్యక్షుడు విక్రమ్ కిషోర్ సూచన మేరకు పుట్లగట్లగూడెం గ్రామంలో బీజేపీ చేరికల కార్యక్రమం నిర్వహించారు. మండల అధ్యక్షురాలు విజ్జు గంగాభవాని, పారేపల్లి సత్యనారాయణ, ఆరేటి ఏసుబాబు ఆధ్వర్యంలో కేతవరం గ్రామానికి చెందిన పెద్దమల్ల బాలు పార్టీ తీర్థం పుచ్చుకున్నారు.ఈ సందర్భంగా ఆరేటి ఏసుబాబు మాట్లాడుతూ, ప్రధాని నరేంద్ర మోదీ అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ఆకర్షితుడై బాలు బీజేపీలో చేరినట్లు తెలిపారు. సమాజ సేవలో ముందుండి దాదాపు 40 సార్లు రక్తదానం చేసిన వ్యక్తి పార్టీలో చేరడం శుభపరిణామమని జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు కటికి రాధాకృష్ణ పేర్కొన్నారు.పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని మాజీ సొసైటీ అధ్యక్షుడు విజ్జు కృష్ణమూర్తి, మండల ఉపాధ్యక్షుడు నారాయణమూర్తి సూచించారు. గ్రామ స్థాయిలో పార్టీ విస్తరణకు ఇది మంచి అవకాశమని అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో పారేపల్లి సత్యనారాయణ, ఆరేటి ఏసుబాబు, కోటపోతుల రామారావు, పారేపల్లి నాగేశ్వరరావు, డి. శివ తదితర బీజేపీ నాయకులు పాల్గొన్నారు.





## జరిగించి తీరుతాం. – మాదారపు తాతాజీ

**వజ్రభారతి,స్టేట్,బ్యూరో,ఏప్రిల్,23:-** అందరూ కలిసి పని చేద్దాం మత విద్వేషాలు రెచ్చగొట్టే వైసిపి నాయకుడు మిమ్మల్ని తప్పుదోవ పట్టిస్తున్నాడని తిమ్మాపురం జనసేన పార్టీ నాయకులు మాదారపు తాతాజీ, బత్తుల దొరబాబులు తెలిపారు. కాకినాడ రూరల్ మండలం తిమ్మాపురం గ్రామం లో గల గ్రామదేవత శ్రీ శ్రీ శ్రీ పాదాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవలు ఘనంగా అందరూ కలిసి పనిచేద్దామని అందుకు అందరూ కమిటీ సహకారంతో ముందుకు వెళ్దామని తెలిపినప్పుడు అలాగే చేద్దాం అని చెప్పి మీరు ఇప్పుడు పోలీస్ స్టేషన్ లో 8 మంది పై ఫిర్యాదు చేయడం ఎంతవరకు సమంజసం అని వారు తెలిపారు. గురువారం తిమ్మాపురం జనసేన పార్టీ కార్యాలయం వద్ద మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ గ్రామం అంతా ఒకటే అందర్నీ కూడా కమిటీలో చేర్చుకుని ముందుకు వెళ్ళవలసిన బాధ్యత మనందరి పైన ఉందని అంతేకానీ తొందర తొందరగా కమిటీని వేసి పబ్బం గడుపుకోవాలని చూస్తున్నా వైసిపి నాయకుడు గ్రామస్తులు తప్పుతో పట్టిస్తున్నాడని అన్నారు. తాటాకు చప్పుడుకు భయపడే ది లేదని నిజం నిర్భయంగా మాట్లాడే మేము గుడికి వెళ్లి దీపం ఆర్పడానికైనా సిద్ధంగా ఉన్నామని మీరు నిజాయితీగా రాగలరా అని వారు ప్రశ్నించారు. నిజాయితీ గల మాపై బురద జల్లటం గొడవలు పెట్టడం పద్ధతి కాదని హెచ్చరించారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు మాదాలపు తాతాజీ యూత్ సభ్యులు, గ్రామ పెద్ద పాల్గొన్నారు.

## ఉమ్మడి కర్నూలు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ తుగ్గలి నాగేంద్ర పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన తుగ్గలి 9వ వార్డ్ రంగనాయకులు



ఉమ్మడి కర్నూలు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ తుగ్గలి నాగేంద్ర



తుగ్గలి 9 వ వార్డు బంగారు రంగనాయకులు

**తుగ్గలి ఏప్రిల్ 23 (వజ్ర భారతి న్యూస్):** దూరదృష్టి, దృఢ సంకల్పమే తుగ్గలి నాగేంద్ర నాయకత్వానికి ప్రతీక అని వ్యాఖ్య పత్తికొండ నియోజకవర్గం అభివృద్ధి కోసం ఆయన కృషి అందరికీ ప్రేరణగా నిలుస్తుందన్న రంగనాయకులు ఆయురారోగ్యాలతో ప్రజాసేవలో కొనసాగాలని ఆకాంక్ష ఉమ్మడి కర్నూలు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ తుగ్గలి నాగేంద్ర శుక్రవారం తన పుట్టినరోజు జరుపుకుంటున్నారు. ఈ సందర్భంగా ఆయనకు రాజకీయ, ప్రముఖుల నుంచి శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. తొమ్మిదవ వార్డ్ బంగారు రంగనాయకులు సోషల్ మీడియా వేదికగా ఉమ్మడి కర్నూలు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ తుగ్గలి నాగేంద్రకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.తుగ్గలి నాగేంద్ర నాయకత్వ పటిమను 9వ వార్డు బంగారు రంగనాయకులు ప్రత్యేకంగా ప్రశంసించారు. దూరదృష్టి, దృఢ సంకల్పం, అభివృద్ధి పట్ల అంకితభావం.. ఇవే మీ నాయకత్వానికి ప్రతీక. ప్రజల సంక్షేమం కోసం మీరు చేస్తున్న నిరంతర కృషి ప్రతి ఒక్కరికీ ప్రేరణగా నిలుస్తోంది తుగ్గలి మండలంలో అభివృద్ధి పథంలో ముందుకు నడిపిస్తున్న తుగ్గలి నాగేంద్ర ఆదర్శంగా నిలిచాడని బంగారు రంగనాయకులు కొనియాడారు. ఆయన నాయకత్వంలో తుగ్గలి మండలం మరింత పురోగతి సాధించాలని ఆకాంక్షించారు. ఉమ్మడి కర్నూలు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ తుగ్గలి నాగేంద్ర సంపూర్ణ ఆయురారోగ్యాలు ప్రసాదించాలని భగవంతుడిని మనసారా కోరుకుంటున్నట్లు తెలిపారు. ఇదే ఉత్సాహంతో ఆయన మరెన్నో సంవత్సరాలు ప్రజలకు సేవ చేయాలని 9వ వార్డు బంగారు రంగనాయకులు ఆకాంక్షించారు.

## స్వచ్ఛ భారత్ మిషన్ శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎంపీడీవో

**కోటనందూరు, ఏప్రియల్ 23, వజ్రభారతి:** కాకినాడ జిల్లా, కోటనందూరు మండల పరిషత్ కార్యాలయంలో గ్రామపంచాయతి అధికారులకు మరియు సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు రెండు రోజులపాటు స్వచ్ఛ భారత్ మిషన్ (గ్రామీణ) శిక్షణా కార్యక్రమాన్ని ఎంపీడీవో పి వెంకట్ నారాయణ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతి ఒక్కరికీ సురక్షితమైన తాగునీరు మరియు పారిశుద్ధ్యం అందించడం ముఖ్యమని పేర్కొన్నారు. స్వచ్ఛ భారత్ మిషన్ లక్ష్య సాధనలో భాగంగా గ్రామాలను బహిరంగ మలవిసర్జన రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలని, ప్రతి ఇంటిలో మరుగుదొడ్ల వినియోగాన్ని పెంచాలని సూచించారు.అలాగే గ్రామాలను ఆరోగ్యకరమైన మరియు అభివృద్ధి చెందిన గ్రామాలు గా మార్చేందుకు అధికారులు కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో ఎస్ జయరాం, డిప్యూటీ ఎంపిడివి ఎం.డి. జలాల్ తదితరులు పాల్గొన్నారు.




# గుండె పోటుతో డా. సురేందర్ మృతి

**రోగికి ఆపరేషన్ చేస్తుండగా దుర్ఘటన**

**డా. సురేందర్ మృతి జిల్లా ప్రజలకు తీరని లోటు**

**మాజీ ఎమ్మెల్యే నారాయణ రావు పటేల్**

**కన్నీరు పెట్టుకున్న ముధోల్ నియోజకవర్గ ప్రజానికం**





**భైంసా వజ్రభారతి న్యూస్ ఏప్రిల్ 23 జిల్లా స్టాఫ్ రిపోర్టర్:** నిర్మల్ జిల్లా భైంసా పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యుడు డాక్టర్ సురేందర్ గుండెపోటుతో మృతిచెందడంతో స్థానికంగా విషాద ఛాయలు అలుముకున్నాయి.ఆయన మృతి పట్ల కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ శాసనసభ్యులు బోస్లే నారాయణరావు పటేల్ తీవ్ర సంతాపం తెలిపారు.మాజీ ఎమ్మెల్యేతో నియోజకవర్గ ప్రజానికం, ప్రముఖ వైద్యులందరు డాక్టర్ సురేందర్ నివాసానికి చేరుకున్న బోస్లే నారాయణరావు పటేల్, ఆయన పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం,కుటుంబ సభ్యులను ఓదార్చి,ఈ క్లిష్ట సమయంలో వారికి ధైర్యం చెప్పారు.డాక్టర్ సురేందర్ వంటి నిస్వార్థ సేవకుడిని, నిష్ణాతుడైన వైద్యుడిని కోల్పోవడం తీరని లోటని పటేల్ పేర్కొన్నారు.ఆయన పేదలకు అందించిన సేవలను, ఎందరో ప్రాణాలను కాపాడిన తీరును ఆయన స్మరించుకున్నారు.నిరుపేదల పట్ల ఆయనకున్న కరుణ, వైద్య రంగంలో ఆయన చేసిన సేవలు ఎప్పటికీ గుర్తుండిపోతాయని, ఆయన లేని లోటును భర్తీ చేయడం కష్టమని పటేల్ అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు,స్థానిక ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని డాక్టర్ సురేందర్ కు నివాళులర్పించారు.

## ఆర్టీసీ కార్మికులు సమ్మె దృష్ట్యా సంగారెడ్డి బస్ డిపో వద్ద భద్రత ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా ఎస్పీ

**ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగడానికి వీలులేదు, ముందస్తు సమాచారం సేకరించాలి**

**అధికారులకు పలు సూచనలు చేసిన జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్,ఐపీఎస్**




**సంగారెడ్డి జిల్లా వజ్రభారతి న్యూస్ ఏప్రిల్ 23 రాష్ట్ర బ్యూరో:** సంగారెడ్డి జిల్లా కేంద్రంలో ప్రస్తుతం కొనసాగుతున్న ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో సంగారెడ్డి బస్ డిపోను సందర్శించిన జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ అక్కడి బందోబస్తు,భద్రత ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా డిపోలో ఉన్న ఆర్టీసీ అధికారులతో మాట్లాడి పరిస్థితులను తెలుసుకున్నారు. బస్సులు, ప్రభుత్వ ఆస్తులకు ఎటువంటి నష్టం జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సమ్మె శాంతియుతంగా కొనసాగేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ రవాణా వ్యవస్థను సక్రమంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అలాగే డిపో పరిసరాల్లో పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఎవరైనా చట్టాన్ని అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, చట్టానికి లోబడి నడుచుకోవాలని అన్నారు. ప్రజలు, కార్మికులు పరస్పర సహకారంతో శాంతి భద్రతలను కాపాడటంలో పోలీసు వారికి సహకరించవలసిందిగా విజ్ఞప్తి చేశారు. ఆర్టీసీ బస్సులు నడపడానికి అర్హత కలిగిన డ్రైవర్లు ముందుకు రావాలని సూచించారు. ఆసక్తి ఉన్న డ్రైవర్లు జిల్లా పోలీసు కంట్రోల్ రూమ్ నంబర్ 8712656739కు సమాచారం ఇవ్వాలని సూచించారు. ప్రైవేట్ డ్రైవర్లు తాత్కాలికంగా విధుల్లోకి వచ్చినా, ఆర్టీసీ డ్రైవర్లు తిరిగి విధుల్లో చేరినా, వారికి ఎటువంటి బెదిరింపులు లేకుండా పూర్తి భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ విజిటింగ్ లో ఆర్ టి సి డిపో మేనేజర్ ఉపేందర్, డిఎస్పీ సత్తయ్య గౌడ్, సంగారెడ్డి పట్టణ ఇన్స్పెక్టర్ రాము నాయుడు. ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ రామకృష్ణరెడ్డి, కొండాపూర్ సిఐ కుమన్ కుమార్ తదితరులు ఉన్నారు.

## ఆష్ఠ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఘనంగా వీడ్కోలు సమావేశం



**అన్ని రంగాల్లో ముందుండాలి**

**మండల విద్యాధికారి గోపిడి రమణా రెడ్డి**

**ముధోల్ వజ్రభారతి న్యూస్ ఏప్రిల్ ఏప్రిల్ 23 జిల్లా స్టాఫ్ రిపోర్టర్:** నిర్మల్ జిల్లా ముధోల్ మండలంలో ప్రాథమిక పాఠశాలలో వీడ్కోలు సమావేశం ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో విద్యార్థులు చేసిన నృత్యాలు అందరినీ ఆకుట్టుకున్నాయి. ఈ సందర్భంగా మండల విద్యాధికారి గోపిడి రమణా రెడ్డి మాట్లాడుతూ ఇప్పటివరకు మన పాఠశాల నుంచి క్రీడా రంగంలో గాని, చదువులో గాని విద్యార్థులు మంచి ఫలితాలని అందించారని, గ్రామస్థుల సహాయ సహకారాల వల్ల ఇవ్వన్నీ సాధ్యమయ్యాయని తెలియజేసారు. ముఖ్య అతిథిగా కార్యక్రమానికి విచ్చేసిన ఆష్ఠ గ్రామ సర్పంచ్ రావుల లావణ్య శ్రీనివాస్ మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి ఎల్లప్పుడూ తమ సహాయ సహకారాలు ఉంటాయాని తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు బలగం రామ్మోహన్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ఎంత ఎదిగినా ఒదిగి ఉండాలని, పెద్దలను గౌరవించాలని అన్నారు.ఎండాకాలం సెలవుల్లో అటు ఇటు తిరగకుండా డ్రాయింగ్, చెస్ లాంటి ఆటలను మీ తల్లిదండ్రుల పర్యవేక్షణలో చేస్తేనే బాగుంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రధానోపాధ్యాయులు సుంకం రాజశేఖర్, అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. అనంతరం పిల్లలకు బహుమానాలను బహుకరించారు.



## ముధోల్ లో దర్శనమిస్తున్న "నో స్టాక్" బోర్డులు

**ఎండల్లో పడిగాపులు కాస్తున్న వాహనాదరులు**

**పక్క మండలాలపై ఆదారపడుతున్న వైనం**

**ముధోల్ వజ్రభారతి ఏప్రిల్ 23 జిల్లా స్టాఫ్ రిపోర్టర్:** నిర్మల్ జిల్లా ముథోల్ పట్టణంలోని ఇందన కొరత నెలకొంది. దీనితో పెట్రోల్ పంపుల వద్ద 'నో స్టాక్' బోర్డులు దర్శనమిస్తున్నాయి.ఇంధనం కోసం స్థానికులు మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాలకు,తానూర్ కు వెళ్లాల్సి వస్తోంది. అధికారులు కొరత లేదని చెబుతున్నా,క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉంది.డీజిల్ కొరత కారణంగా ట్రాక్టర్లు,లారీలు,టిప్పర్లు వంటి భారీ వాహనాలు నిలిచిపోయాయి.పెట్రోల్ పంప్ యజమానులు రెండు రోజుల్లో డీజిల్ వస్తుందని చెబుతున్నా,వాహనదారులు నమ్మడం లేదు. ఇది వాహనదారులకు తీవ్ర ఇబ్బందులను కలిగిస్తోంది.ప్రజలు ఈ పరిస్థితికి అధికారుల పర్యవేక్షణ లోపాన్ని కారణంగా చూపుతున్నారు.సరైన సమయంలో చర్యలు తీసుకోకపోవడం వల్ల ఇంధన కొరత ఏర్పడిందని వారు వాపోతున్నారు. అధికారులు వెంటనే స్పందించి,ఇంధన సరఫరాను పునరుద్ధరించాలని కోరుతున్నారు.ఈ ఇంధన కొరత వల్ల నిత్యవసరాల రవాణా కూడా ప్రభావితమయ్యే అవకాశం ఉంది. తక్షణమే సమస్యను పరిష్కరించకపోతే, ప్రజల ఇబ్బందులు మరింత పెరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## అన్నవరం శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దివ్య కళ్యాణ మహోత్సవాలు




**అన్నవరం వజ్రభారతి ప్రతినిధి.ముఖే.వీరబాబు ఏప్రిల్ :-23 :** ప్రముఖ పుణ్యక్షేత్రం అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి వారి దేవస్థానంలో ఈ నెల .26.04.2026 నుండి మే.02.05.2026 వరకు శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి వార్షిక దివ్య కళ్యాణ మహోత్సవములు సందర్భముగా వైదిక కమిటీ సూచనల ప్రకారము కళ్యాణ మహోత్సవముల నిర్వహణ తేదీలలో అనగా .26.04.2026 నుండి ది.02.05.2026 వరకు దేవస్థానములో జరుగు ఆర్జిత సేవలు అనగా శ్రీ స్వామివారి నిత్య కళ్యాణం, ఆయుష్య హోమము, సహస్ర దీపాలంకరణ సేవ, మరియు సోమవారము జరుగు ముత్యాల అలంకరణ సేవ, గురువారము చేయు నిజరూప దర్శనము, మరియు ప్రతి రోజూ రాత్రి గం.7.00 లకు జరుగు పంచ హారతుల సేవ, ఏకాంత సేవ మరియు ప్రతి శనివారము చేయు ప్రాకార సేవ (తిరుచ్చి సేవ), ప్రతి ఆదివారము ఉదయము జరుగు రధ సేవ బ్రహోత్సవములు సందర్భముగా నిలుపుదల చేయడమైనది. మరియు శ్రీ స్వామివారికి ఏకాదశి రోజున జరుగు స్వర్ణ పుష్పార్చన అర్చకులు మాత్రమే నిర్వహించెదరు. మరియు శ్రీ వనదుర్గ ఆలయము నందు ప్రతి శుక్రవారము జరుగు ఖడ్గమాల పూజ, చండీ హోమము మరియు పౌర్ణమినాడు జరుగు ప్రత్యంగిరా హోమము, యధావిధిగా జరుగునని కార్యనిర్వహణ అధికారి తెలియపరిచినారు

# ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుంది





**పిల్లలు అన్నిరంగాల్లో రానిస్తున్నారు**

**మీ పిల్లలను ప్రభుత్వ పాఠశాల్లల్లోనే చేర్పించండి**

**ప్రజపాలన -ప్రగతి ప్రణాళిక లో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్**

**నిర్మల్ వజ్రభారతి న్యూస్ ఏప్రిల్ 23 జిల్లా స్టాఫ్ రిపోర్టర్:** నిర్మల్ మండలం ద్యాంగాపూర్ లో జరిగిన "ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న సంక్షేమ వారోత్సవాల సందర్భంగా ప్రభుత్వ బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు, పోషకుల సమావేశానికి జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సంక్షేమ వారోత్సవాల భాగంగా ఇలాంటి సమావేశాలు నిర్వహించడం ద్వారా పాఠశాల అభివృద్ధికి బలమైన పునాది ఏర్పడుతుందని తెలిపారు. పోషకులు, తల్లిదండ్రులు ఈ సమావేశాలకు తప్పనిసరిగా హాజరుకావాలని సూచించారు. ఈ సమావేశాల ద్వారా విద్యార్థుల ప్రగతి వివరాలు తల్లిదండ్రులకు స్పష్టంగా తెలిసి, వారి అభ్యాసంపై మరింత దృష్టి పెట్టేందుకు సహాయపడుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే అర్హత గల ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్య అందించబడుతోందని, అక్కడ చదువుతున్న విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా విశేష ప్రతిభ కనబరుస్తున్నారని కలెక్టర్ సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులకు వార్షిక ప్రగతి నివేదికలు అందజేశారు. అలాగే విద్య, క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు, జ్ఞాపికలు అందించి ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో డిటిడిఓ అంబాజీ, డీఈవో భోజన్న, సిపిఓ జీవరత్నం, తహసిల్దార్ ప్రభాకర్, ప్రధానోపాధ్యాయురాలు శైలజ, గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్‌లు నవీన్, హరీష్, ఇతర అధికారులు, విద్యార్థుల పోషకులు పాల్గొన్నారు.



## తెలుగు విశ్వ విద్యాలయంలో ఘనంగా పుస్తకావిష్కరణ మహోత్సవం

**ఆచార్య ఎండ్లూరి సుధాకర్ పుస్తకాల ఆవిష్కరణ:** తాళ్లపూడి / రాజమండ్రి వజ్ర భారతి ఏప్రిల్ 23: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం (బొమ్మూరు) మరియు మనోజ్ఞ సాహిత్య వేదిక సంయుక్త ఆధ్వర్యంలో గురువారం తెలుగు విశ్వవిద్యాలయ ప్రాంగణంలో ఆచార్య ఎండ్లూరి సుధాకర్ పుస్తకాల పుస్తకావిష్కరణ మహోత్సవం ఘనంగా జరిగింది. రచయిత, అధ్యాపకులు కూర్మయ్య వ్యాఖ్యతగా వ్యవహరించారు. ఈ కార్యక్రమానికి తెలుగు విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య డి. మునిరత్నం నాయుడు ముఖ్య అతిథిగా విచ్చేసి పుస్తకాలను ఆవిష్కరించి తన అధ్యాపక మిత్రులుగా ఎండ్లూరి సుధాకర్ జ్ఞాపకం చేసుకున్నారు. గౌరవ అతిథిగా రిజిస్ట్రార్ డా. ముసుగు శ్రీనివాసరావు పాల్గొని ఆచార్య ఎండ్లూరి సుధాకర్ విశిష్ఠత గురించి వివరించారు. కవిగా, అధ్యాపకునిగా ఆయన సేవలు వారి పూర్వ విద్యార్థులు, అభిమానులు గుర్తుచేసుకున్నారు. డా. పుట్ల హేమలత ఇదే విశ్వవిద్యాలయంలో ఆచార్య భాస్కర్ రావు పర్యవేక్షణలో అంతర్జాలంలో తెలుగు సాహిత్యం పై మొట్ట మొదటి పరిశోధన చేశారని డా. అద్దంకి రాజా యోనా ఫిలాశ్రోపిక్ సొసైటీ వ్యవస్థాపకులు తెలియజేశారు. ఆత్మీయ అతిధిగా విచ్చేసిన డా. జాలాది విజయ తన గురువులైన డా. ఎండ్లూరి సుధాకర్, డా. పుట్ల హేమలత డొక్కా సీతమ్మలా విద్యార్థులను కన్న తల్లిలా చూసుకున్న విషయాలను తలుచుకున్నారు. పి. విజయ్ కుమార్ తెలుగు రుబాయీల గురించి, వూటుకూరి వరప్రసాద్ హేమంతం గురించి నామాడి శ్రీధర్ నీలి గులాబీలు గురించి వివరించారు. సామాజిక వేత్త కొయ్యాన కుమారి సభకు తనదైన శైలిలో అద్భుతంగా అధ్యక్షత వహించారు. ప్రముఖ రచయితలు దొండపాటి రాజా రావు, ఆర్.ఎస్. వెంకటేశ్వర రావు సభకు విచ్చేసి పలు విషయాలు పంచుకున్నారు. ఈ కార్యక్రమాన్ని మనోజ్ఞ సాహిత్య వేదిక వ్యవస్థాపక సభ్యులు వెంకటేశ్వరరావు కట్టూరి నిర్వహించారు. ఆచార్య ఎండ్లూరి సుధాకర్, డా. పుట్ల హేమలత కుమార్తె మానస ఎండ్లూరి వందన సమర్పణ చేశారు.

## ప్రజలందరికీ భగీరథుని ఆశయాలు ఎంతో ఆదర్శప్రాయం... జిల్లా కలెక్టర్ సిరి



**కర్నూల్ ఏప్రిల్ 23, వజ్రభారతి ( జిల్లా ఇంచార్జి పద్మావతి ):** భగీరథ మహర్షి ఆలోచనలు, విలువలు ప్రస్తుత తరానికి ఆదర్శమని కర్నూలు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి తెలిపారు. కలెక్టరేట్లోని సునయన ఆడిటోరియంలో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన జయంతి వేడుకల్లో ఆమె పాల్గొన్నారు. భగీరథ మహర్షి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. సమాజానికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని, కఠోర దీక్షతో గంగను భువికి తెచ్చిన మహనీయుడని ఆమె కొనియాడారు.

## ఆంగ్ల భాషా దినోత్సవం



**తణుకు, వజ్ర భారతి, ఏప్రిల్ 23.:** స్థానిక యస్.కె.యస్.డి. మహిళా డిగ్రీ అండ్ పీజీ (అటానమస్) కళాశాలలో ఆంగ్లభాషాదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపల్ కెప్టెన్ యు. లక్ష్మీసుందరీబాయ్ మాట్లాడుతూ ప్రతీ సంవత్సరం ఏప్రియల్ 23వ తేదీన ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో ఈ వేడుక జరుగుతుందని మరియు విలియం షేక్ స్పియర్ జయంతి కూడా ఇదేరోజు కావడం విశేషమని మరియు ఆంగ్లభాషను సుసంపన్నం చేయడంలో ఆయన పాత్ర అనన్యసామన్యమని నేటి ఆధునిక ప్రపంచంలో ఇంగ్లీషు కేవలం ఒక భాష మాత్రమే కాదని, ప్రపంచంలోని వివిధ దేశాల ప్రజలను, సంస్కృతులను కలిపే వారధిలాగా ఉందని, ఇంగ్లీష్ భాషంటే భయపడకుండా నేర్చుకోవాలని, నిత్యం సాధన చేయాలని, ఆంగ్ల దినపత్రికలు చదవాలని తెలియజేశారు. ఇంగ్లీష్ శాఖాధిపతి కె. కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఇంగ్లీషు భాష నేర్చుకోవడం వలన దేశ, విదేశాలలో ఉద్యోగం అవకాశాలు లభిస్తున్నాయి మనం వాడుతున్న ఇంటర్నెట్ సమాచారం 50 శాతం కంటే ఎక్కువభాగం ఇంగ్లీషులో ఉన్నదని, సైన్సు, మెడిసిన్, ఇంజనీరింగ్ మొదలైన తాజా సమాచారం ఆంగ్లభాషలో లభ్యమవుతుందని తెలియజేశారు. ఈ సందర్భంగా ఇంగ్లీషు సర్టిఫికెట్ కోర్సు పూర్తిచేసిన విద్యార్థినులకు సర్టిఫికెట్స్ ను అందజేసినారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు సి. హెచ్. రమేసార్ బాబు, ఎస్. జగదీశ్వరరావు, తెలుగు, హింధీ, సంస్కృత అధ్యాపకులు మరియు విద్యార్థినులు పాల్గొన్నారు.



## పారదర్శకంగా కౌన్సెలింగ్... కర్నూల్ జిల్లా ఎస్పీ

**కర్నూల్ ఏప్రిల్ 23,వజ్రభారతి ( జిల్లా ఇంచార్జి పద్మావతి ) :** జిల్లా పోలీసు శాఖ బదిలీలలో పారదర్శకంగా కౌన్సెలింగ్ నిర్వహించినట్లు ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. జిల్లా కార్యాలయంలో బుధవారం జరిగిన ప్రక్రియలో 133 మంది పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. వీరిలో 15 ఏఎస్సైలు, 25 మంది హెడ్ కానిస్టేబుల్స్, 93 మంది కానిస్టేబుల్స్ ఉన్నారు. ఒకే స్టేషన్లో 5 ఏళ్లు పూర్తి చేసిన సిబ్బందికి నిబంధనల ప్రకారం బదిలీలు చేపట్టినట్లు ఎస్పీ వెల్లడించారు.

## ఘనంగా ప్రభుత్వ పాఠశాల వార్శికొత్సవం



పెనుమంట్ర మండలంలోని నత్తారామేశ్వరం గ్రామంలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల వార్శికోత్సవం,ఐదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిధిగా పాఠశాల పూర్వ విద్యార్థి,సామాజికవేత్త ప్రముఖ అంతర్జాతీయ శిల్పి, కళా రత్న,డాక్టర్ దేవగుప్తాపు రాజకుమార్ ఉడ యార్ పాల్గున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంత ప్రభుత్వ పాఠశాలలో కార్పొరేట్ స్థాయి సదుపాయాలు కల్పించి,విద్యార్థులకు చక్కని అవకాశాలు వచ్చే విధంగా గ్రామస్తులు, దాతలు,నిత్యం విద్యార్థుల ఉత్తమ భవిష్యత్తుకు బాటలువేస్తున్న ఉపాధ్యావయులకు అభినందనలు తెలిపారు. ఎంపీటీసీ తమనంపూడి.నాగ వెంకట సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్పించిన తల్లితండ్రులను అభినందించి,ప్రోత్సహించాలని కోరారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి విద్యార్థిని, విద్యార్థులకు మెరిట్ స్కాలర్షిప్, పారితోశకం, ప్రశంసా పత్రం ఇచ్చేవిధంగా కృషి చేస్తామన్నారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యకలాపాలు నిర్వహించారు. పాఠశాల అభివృద్ధికి సహకరించిన 15మంది దాతలను సత్కరించారు,ఐదవ తరగతి నుండి 6వ తరగతికి ప్రమోటుఐన 7గురు విద్యార్థులకు గోల్డుమెడల్స్ ,ప్రశంసా పత్రం ఇచ్చి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కాదులూరి.సాయి తులసి,వల్లభనేని.నాగమణి మేడపాటి.రంగనాధ రెడ్డి,కర్రి.లక్ష్మణ్ రెడ్డి మాజీ ఉప సర్పంచ్ మల్లిడి.కిరణ్ కుమార్ రెడ్డి,కర్రి.కల్కి రెడ్డి,కడలి.రాంబాబు,పేరెంట్స్,గ్రామస్తులు పాల్గున్నారు.

## విద్యా బాల మందిర్ విద్యార్థులకు మెడల్స్




**కొత్తపేట, వజ్రభారతి, ఏప్రిల్ 23.:** జనాభా లెక్కలు -2026 భాగంగా కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాల ఉత్తర్వులు మేరకు జనాభా లెక్కలు అనే అంశంపై పాఠశాలలో ఆరోవ తరగతి నుండి ఎనిమిదో తరగతి వరకు చదువుకున్న విద్యార్థిని విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, క్విజ్, పోటీలు నిర్వహించి అందులో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రధమ, ద్వితీయ, తృతీయ సాధించిన వారికి మండల విద్యాశాఖాధికారి వారు ఇచ్చిన మెడల్స్ ను పాఠశాల కరస్పాండెంట్ రామోజు అనురాధ చేతుల మీదుగా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రదాన ఉపాధ్యాయులు నూకపేయి శివరత్నం ఉపాధ్యాయులు సుధాకర్ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.



## మంచు పర్వతం పై నృత్యం చేసిన వరేణ్యకు సన్మానం



**నిర్మల్ వజ్రభారతి న్యూస్ ఏప్రిల్ 23 జిల్లా స్టాఫ్ రిపోర్టర్:** నిర్మల్ జిల్లా సోన్ మండలానికి చెందిన జమ్ము కాశ్మీర్లోని గుల్మార్గ్ ప్రాంతం వద్ద 3950 మీటర్ల ఎత్తున గల అఫర్వత్ మంచుపర్వతంపై కూచిపూడి నృత్యం చేసిన డా. సరిత రాణి నాగేష్ దంపతుల కూతురు చిన్నారి వరేణ్యను కలం స్నేహం అధ్యక్షురాలు దేవిప్రియ, కలం స్నేహం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కొండూరు పోతన్న,కడారి దశరథ్ ఘనంగా సన్మానించారు. కేవలం 10 సంవత్సరాల వయసులోని కూడా సరిగా అందని పర్వతంపై నృత్యం చేయడం అద్భుతమని చిన్నారి యొక్క ధైర్యసాహసాలను మెచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రణవ శ్రీ,కవిత, రాణి తదితరులు అభినందించారు.

## భారతి నగర్‌లో చలివేంద్రం ప్రారంభం

### వేసవిలో ప్రజలకు తాగునీటి సదుపాయం

### మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి





**పటాన్చెరు నియోజకవర్గం వజ్ర భారతి న్యూస్ ఏప్రిల్ 23 రిపోర్టర్ :జింక గణేష్ :** భారతి నగర్ డివిజన్ పాత ఎంఐజీ కాలనీలో ఈ రోజు ఏర్పాటు చేసిన చెలివేంద్రం కార్యక్రమాన్ని మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి ప్రారంభించారు. ఈ చెలివేంద్రాన్ని భాస్కర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా సింధు ఆదర్శ్ రెడ్డి మాట్లాడుతూ, పెరుగుతున్న వేసవి ఉష్ణోగ్రతల కారణంగా ప్రజలకు తాగునీటి అవసరం ఎక్కువగా ఉందని, అలాంటి సమయంలో చెలివేంద్రాలు ఏర్పాటు చేయడం ఎంతో అవసరమని తెలిపారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు ప్రజలకు తాత్కాలిక ఉపశమనం ఇవ్వడమే కాకుండా సామాజిక బాధ్యతను కూడా ప్రతిబింబిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, కాలనీ నివాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# శ్రీరాములవారికి పట్టాభిషేకం



**తణుకు, వజ్ర భారతి, ఏప్రిల్ 23:** తణుకు మండలం దువ్వ గ్రామంలో వేంచేసి ఉన్న కమ్మవారి శ్రీరామాలయం నందు శ్రీ కోదండ రామచంద్ర స్వామి వారి మహా సామ్రాజ్య పట్టాభిషేక మహోత్సవం పురస్కరించుకొని సీతారామ కళ్యాణ మహోత్సవంఅత్యంత వైభవంగా నిర్వహించారు. స్వామివారికి విశ్వక్సేన పూజ, అగ్ని ప్రతిష్ట, యోగపూజా చేపట్టారు. శుక్రవారం శతాబ్ది ఉత్సవ సహిత శ్రీ కోదండ రామచంద్రస్వామి మహా సామ్రాజ్య పట్టాభిషేకంనిర్వహిం చనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది.. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ బృందం, భక్తులు గ్రామస్తులు పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

# స్వర్ణాంధ్ర లో పాలీసెట్ పరీక్షా కేంద్రాలకు ఉచిత బస్సు.

**నరసాపురం, వజ్ర భారతి, ఏప్రిల్ 23.:** స్వర్ణాంధ్ర పాలిటెక్నిక్ కాలేజీ నందు ఈ నెల 25 వ తేదినందు 10 వ తరగతి పాసై పాలీసెట్ పరీక్షకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షా నిర్వహించబడుతుందని టౌన్ కోఆర్డినేటర్ ఎం సి హెచ్ రామన్న మరియు సెంటర్ కోఆర్డినేటర్ డా. కిరణ్మయి(ప్రిన్సిపాల్) తెలిపారు. ఉ. 11 గం. పరీక్షా ప్రాంభమవుతుంది అని 9 గం పరీక్షా కేంద్రానికి చెరుకోవాలని తెలిపారు. నరసాపురం బస్టాండ్ మరియు రైల్వే స్టేషన్ నుండి ఉచిత బస్సు సదుపాయం కలదని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కళాశాల యాజమాన్యం చైర్మన్ కె.వి సత్యనారాయణ, ట్రెజరర్ కె.వి స్వామి మరియు డైరెక్టర్ శ్రీహరి తెలిపినారు.

# పుస్తక పఠనం జ్ఞానానికి నాంది



**తణుకు, వజ్ర భారతి, ఏప్రిల్ 23:** తణుకు పురుషులు శాఖా గ్రంథాలయం నందు అధ్యక్షురాలు వావిలాల సరళా దేవి అధ్యక్షతన ప్రపంచ పుస్తక దినోత్సవం కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సరళా దేవి మాట్లాడుతూ ప్రపంచ పుస్తక దినోత్సవం 1995లో పుస్తకం చదవడం మనిషికి విజ్ఞానాన్ని వినోదాన్ని అందించిటమే కాకుండా మనిషి వ్యక్తిత్వానికి వికాసానికి పుస్తకం దోహదపడుతూ మనిషి సంపూర్ణ ఆరోగ్యంగా ఉండడానికి ఎంత దోహదపడుతుందని గ్రహించిన యునెస్కో వారు ఏప్రిల్ 23న ప్రపంచ పుస్తక దినోత్సవం గా ప్రకటించారని, విలీనియం షేక్స్ పియర్, గార్సిలాసో డీలా వేగా వంటి రచయితల పుట్టినరోజులు వర్ధంతి కూడా ఏప్రిల్ 23 వ తేదీన ప్రకటించడం జరిగిందని తెలియజేశారు. ప్రతి ఒక్కరు పుస్తక పఠణాన్ని అలవాటు గా మలుచుకుని మనలోని వ్యక్తిత్వాన్ని వికాసాన్ని పెంపొందించుకోవాలని పిల్లలకు కూడా ఈ అలవాటు పెద్దలు నేర్పించి వారికి మంచి భవితిని ఇవ్వాలని ఆరోగ్యానికి పుస్తకాన్ని వారి అలవాడు చేస్తూ అనారోగ్యాలను ఇచ్చే సెల్ ఫోన్లు దూరం చేయాలని ఆమె పిలుపునివ్వడం జరిగినది. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ఎన్.వి.రాంకుమార్, బెజవాడ సూరిబాబు, చీకటి శ్రీనివాస్,సప్పా రాజు, ఎం జ్యోతి లైబ్రేరియన్ గుత్తికొండ రామారావు, పృథ్వీ విద్యార్థిని విద్యార్థులు పాల్గొనడం జరిగింది.

# ఎంజేపీ గురుకుల ప్రిన్సిపాల్ స్రవంతికి సన్మానం

## అభినందించిన తల్లిదండ్రులు అధ్యాపబృందం



**పఠాన్ చెరు, వజ్ర భారతి, ఏప్రిల్ 23:** పటాన్ చెరు మండలం చిన్న కంచర్ల గ్రామంలో గల బీసీ గురుకుల,మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల,కళాశాలలో ప్రజాపాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా టీచర్, తల్లిదండ్రుల మీటింగ్ ఏర్పాటు చేయడం జరిగింది. ఇటీవల వెలువడిన ఇంటర్ ఫలితాలలో రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధించడానికి కృషి చేసినందుకుగాను,ఎంజేపీ ప్రిన్సిపాల్ స్రవంతిని తల్లిదండ్రులు మరియు అధ్యాపక బృందం,ఘనంగా సన్మానించారు. ప్రిన్సిపాల్ బి.స్రవంతి మాట్లాడుతూ, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడానికి ప్రభుత్వం కృషి చేస్తుందని, ఉత్తమమైన అధ్యాపక బృందంతో విద్యా బోధన జరుగుతుందని,విద్యార్థుల కృషి అధ్యాపకుల మార్గదర్శకత్వంతో సహాయ సహకారంతో విజయాలు సాధ్యమయ్యాయని అన్నారు. భవిష్యత్తులో తల్లిదండ్రుల సహకారంతో కూడా ఇలాంటి ఉత్తమ ఫలితాలు సాధించడానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏటీపీ రేఖలక్ష్మి,వార్డెన్ శ్రీధర్, అధ్యాపకులు,దశరథ్, దేవయ్య, అనిల్, శివశంకర్,రాజ్ కుమార్, హుస్సేన్, రాజస్వామి,మాధురి మౌనిక,శ్రీ లక్ష్మి,త్రివేణి,వినయ్ విష్ణు వర్ధన్, హుస్సేన్, క్రాంతి శ్రీకాంత్, నర్సింలు,ప్రశాంత్, మహేందర్, తల్లిదండ్రులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# మరో 15 ఏళ్లు అధికారంలో కూటమి ప్రభుత్వం

- కూటమి ప్రభుత్వంపై అసత్య ప్రచారాలు మానుకోవాలి
- తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ హితవు
- పాలూరులో అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే
- ఉచిత కంటి వైద్య శిబిరం ప్రారంభించిన ఎమ్మెల్యే







**తణుకు, వజ్రభారతి, ఏప్రిల్ 23:** పదిహేనేళ్ల పాటు కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండి తీరుతుందని తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. అత్తిలి మండలం పాలూరు గ్రామంలో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించి అనంతరం పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతిపక్ష పార్టీ వైసిపి నేతలు కూటమి ప్రభుత్వంపై అసత్య ప్రచారాలు మానుకోవాలని విజ్ఞప్తి చేశారు. మద్యం రవాణా కేసులో ఉన్న మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు సిబిఐ అధికారులకు రూ. 25 లక్షల లంచం ఇవ్వడానికి ప్రయత్నించారని ఆరోపణలతో ఆయనపై సిట్ కేసు నమోదు చేసిందని గుర్తు చేశారు. ఇందులో కూటమి నాయకుల ప్రమేయం ఏముందని ప్రశ్నించారు. దర్యాప్తు సంస్థలు ఆయనపై ఆయన కుమారుడు పైన విచారణ చేస్తున్నాయని చెప్పారు. దొంగే దొంగ దొంగ అన్నట్లుగా సొంత మీడియాలో అసత్య ప్రచారాలు చేసుకోవడం విడ్డూరంగా ఉందని అన్నారు. ఎన్ని తప్పుడు ప్రచారాలు చేసుకున్నా




నీటి మీద రాతలుగానే మిగులుతాయని హితవు పలికారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా ఇచ్చిన నామినేటెడ్ పోస్టులలో తణుకు నియోజకవర్గంలో జనసేన పార్టీకి అత్యధిక ప్రాధాన్యత ఇచ్చినట్లు గుర్తు చేశారు. అంధత్వ నివారణకు కూటమి ప్రభుత్వం తరపున కృషి చేస్తున్నట్లు తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. కంటికి సంబంధిత వ్యాధులతో ఎవరు ఇబ్బంది పడకూడదు అనే ఉద్దేశం తో రాబోయే రోజుల్లో ప్రతి గ్రామాల్లో ఉచిత కంటి వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అవసరమైన వారికి ఉచితంగా కళ్ళజోళ్ళు అందజేయడంతో పాటు అత్యవసరమైన వారికి శస్త్ర చికిత్సలు చేయడానికి ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. కంటి సంబంధిత ఇబ్బందులు ప్రారంభ దశలోనే గుర్తించడం ద్వారా భవిష్యత్తులో మరిన్ని ఇబ్బందులు రాకుండా కట్టడి చేయవచ్చని అన్నారు. అనంతరం పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఎమ్మెల్యే రాధాకృష్ణ పాల్గొన్నారు. రూ. 20 లక్షల వ్యయంతో రెండు సిసి రోడ్లు ప్రారంభించారు. రూ. 17 లక్షల విలువైన రెండు ట్రాన్స్ ఫార్మర్లు లో వోల్టేజి సమస్య తీర్చేందుకు వీటిని ఏర్పాటు చేశారు. అనంతరం గ్రామ తెలుగుదేశం పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. పాలూరు ప్రాథమిక సహకార సంఘం పరిధిలోని లాకర్ ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఉచిత మెగా వైద్య శిబిరం

## పేదలు సద్వినియోగం చేసుకోవాలి: డాక్టర్ బాబ్జీ పిలుపు





**పెనుగొండ, ఏప్రిల్ 23 ( వజ్రభారతి ):** పేద మరియు సాధారణ ప్రజలకు ఆరోగ్య సేవలు సులభంగా అందాలనే లక్ష్యంతో నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని వాసంశెట్టి వీరన్న చారిటబుల్ ట్రస్టు ఫౌండర్ చైర్మన్ వాసంశెట్టి చంద్రశేఖర్ అజాద్ (డాక్టర్ బాబ్జీ) సూచించారు. గురువారం పెనుగొండలోని గుడిమెట్ల ధర్మారెడ్డి, రెడ్డి కల్యాణ మండపంలో ట్రస్టు ఆధ్వర్యంలో, పాలకొల్లు మెడ్ యునైటెడ్ హాస్పిటల్ సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఆయన ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుత కాలంలో మారుతున్న వాతావరణ పరిస్థితులు, జీవనశైలి మార్పులు కారణంగా గుండె, నాడీ సంబంధిత సమస్యలు, సాధారణ అనారోగ్యాలు పెరుగుతున్నాయని తెలిపారు. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని కార్డియాలజీ, న్యూరాలజీ, జనరల్ మెడిసిన్ విభాగాల్లో నిపుణుల ద్వారా ఒకే వేదికపై వైద్య సేవలు అందించేందుకు ఈ శిబిరాన్ని తన తండ్రి వాసంశెట్టి వీరన్న జ్ఞాపకార్థం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజంలో ఆరోగ్య చైతన్యాన్ని పెంచడమే కాకుండా, ఆర్థికంగా బలహీన వర్గాలకు ఎంతో ఉపశమనం కలిగిస్తాయని చెప్పారు. శిబిరంలో కార్డియాలజిస్ట్ డా. హృదయ్ మోహన్, న్యూరాలజిస్ట్ డా. వెంకట అనుపమ, జనరల్ మెడిసిన్ వైద్యులు డా. మనోజ్ కుమార్, డ్యూటీ డాక్టర్ డా. జాస్లిన్ పాల్గొని రోగులకు సమగ్ర వైద్య పరీక్షలు నిర్వహించారు. ముఖ్యంగా ఈసీజీ పరీక్షలు చేసి గుండె సంబంధిత సమస్యలను ముందుగానే గుర్తించే ప్రయత్నం చేశారు. అవసరమైన రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేసి, ఆరోగ్యంపై జాగ్రత్తలు పాటించే విధంగా సూచనలు అందించారు. ఈ కార్యక్రమాన్ని మెడ్ యునైటెడ్ హాస్పిటల్ ఆపరేషన్స్ వైస్ ప్రెసిడెంట్ వి. రవి కిరణ్ రెడ్డి, కస్టమర్ సర్వీస్ ఉ ఐటీ ఏజీఎం అమర్, క్లస్టర్ హెడ్ వి. గౌతమ్ రాజు, పమ్మి ఏడుకొండలు పర్యవేక్షించారు. కార్యక్రమంలో మెడ్ యునైటెడ్ సిబ్బంది కృష్ణ భగవాన్, సారథి, సుమ, శంకర్, నాజర్, మహేష్ తదితరులు చురుకుగా పాల్గొన్నారు. ఈ ఉచిత మెగా వైద్య శిబిరానికి పెనుగొండ పరిసర ప్రాంతాల నుండి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై వైద్య సేవలను పొందారు. ట్రస్టు నిర్వహించిన ఈ సేవా కార్యక్రమంపై స్థానికులు ప్రశంసలు వ్యక్తం చేస్తూ, ఇలాంటి శిబిరాలను మరింత తరచుగా నిర్వహించాలని కోరుకున్నారు.





# పెనుమంత్ర ఐ సి డి ఎస్ ఆఫీసులో పోషణపక్వాడ ముగింపు సమావేశం

పెనుమంట్ర, వజ్రభారతి, ఏప్రిల్ 23: పెనుమంట్ర ఐ సి డి ఏ స్ ప్రాజెక్ట్ ఆఫీస్ నందు సీడీపీఓ ఎ.కృష్ణ కుమారి అధ్యక్షతన పోషణ పక్వాడ ముగింపు సమావేశం నిరహించడం జరిగింది. కార్యక్రమంలో భాగంగా పోషణ పక్వాడ కార్యక్రమాలు నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన కార్యకర్తలకు, సహాయకులకు బహుమతి ప్రధానం చేయడం జరిగింది. అలాగే కార్యకర్తలకు, సహాయకులకు సమీక్ష సమావేశం నిర్వహించారు. సమయపాలన పాటించాలని కేంద్రాన్ని పరిశుభ్రంగా ఉంచడం మరియు మెనూ ప్రకారం క్వాలిటీ గా ఫీడింగ్ ఇవ్వడం, స్టాక్స్ తీసుకునేటప్పుడు క్వాలిటీ, క్వాంటిటీ చూసుకోవాలని చెప్పడం జరిగింది. ప్రీస్కూల్ నమోదులు పెంచే విధంగా ప్రయత్నించాలని కార్యకర్తలు, సహా యకురాలు 3-6 సంవత్సరాల పిల్లల గృహ లను సందర్శించి వారికి ప్రీస్కూలు కార్యక్రమాలపై అవగాహన కల్పించి నమోదులు మెరుగు పరుచుకోవాలని వివరించడం జరిగింది. కేంద్రానికి వచ్చిన పిల్లలను తిరిగి ఇంటికి పంపించేవరకు జాగ్రత్తగా చూడవలెనని లబ్ది దారుల పట్ల



మర్యాదగా ఉండాలని ప్రతి ఒక్క లబ్దిదారులు అంగన్వాడీ సేవలు వినియోగించు కొనేలా ప్రతి కార్యకర్త, సహాయకురాలు కృషి చేసి కేంద్ర నిర్వహణ మెరుగు పరుచుకోవాలని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమం లో సూపర్వైజర్స్, అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకురాళ్లు మరియు తల్లులు హాజరు పాల్గొన్నారు.



# యాంకర్ విష్ణుప్రియపై అసభ్య కంటెంట్ ఆరోపణలు..

యాంకర్ విష్ణుప్రియ భీమినేని చుట్టూ సోషల్ మీడియాలో కొత్త వివాదం చెలరేగింది. ఆమె ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో అసభ్యకర కంటెంట్‌ను ప్రోత్సహిస్తున్నారంటూ ఆరోపణలు వెల్లువెత్తడంతో, ఏఐఎస్ఎఫ్ నాయకులు పోలీసులను ఆశ్రయించారు. విజయవాడలోని సూర్యారావుపేట సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో ఏఐఎస్ఎఫ్ నేతలు అధికారిక ఫిర్యాదు సమర్పించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం. సాయికుమార్ నేతృత్వంలో ఈ ఫిర్యాదు ఇచ్చినట్లు సమాచారం.తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతా ద్వారా అర్ధనగ్న వీడియోలు వీక్షించాలంటే సభ్యత్వ రుసుము చెల్లించాలని విష్ణుప్రియ ప్రచారం చేస్తున్నారని ఏఐఎస్ఎఫ్ నేతలు ఆరోపించారు. టెలివిజన్ షోల ద్వారా మంచి గుర్తింపు పొందిన ఒక ప్రజాప్రతినిధి స్థాయి సెలబ్రిటీ, ఇలాంటి కంటెంట్‌ను ప్రోత్సహించడం యువతపై ప్రతికూల ప్రభావం చూపుతుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. సమాజంలో ఆదర్శంగా ఉండాల్సిన వ్యక్తులు డబ్బు కోసం ఇలాంటి చర్యలకు పాల్పడటం సిగ్గుచేటని ఏఐఎస్ఎఫ్ నాయకులు తీవ్రంగా విమర్శించారు. ఈ తరహా కంటెంట్ వల్ల సమాజంలో నైతిక విలువలు దెబ్బతింటాయని వారు పేర్కొన్నారు. సైబర్ క్రైమ్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో ఏఐఎస్ఎఫ్ నేతలు రెండు ప్రధాన డిమాండ్లు చేశారు. విష్ణుప్రియ ఇన్‌స్టాగ్రామ్ ఖాతాను తక్షణమే నిలిపివేయాలి, అలానే ఫిర్యాదు చేసిన సమయంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు దీపక్, సిద్దు, మనోజ్ సహా పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు. సమాజంలో ఇలాంటి ధోరణులను సహించబోమని, అవసరమైతే న్యాయపరమైన పోరాటం కొనసాగిస్తామని వారు హెచ్చరించారు. సోషల్ మీడియా కంటెంట్‌పై బాధ్యత, నైతికత అంశాలు మరోసారి చర్చకు వచ్చాయి. ఈ వ్యవహారంపై పోలీసులు ఎలా స్పందిస్తారు? విష్ణుప్రియ నుంచి ఎలాంటి క్లారిటీ వస్తుంది? అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. కాగా, విష్ణు ప్రియ పోవే పోరా షోతో తెలుగు ప్రేక్షకులని పలకరించి మంచి గుర్తింపు సంపాదించింది. అలానే బిగ్ బాస్ షోలోను పాల్గొని సందడి చేసింది.




# కండలు పెంచి..కొత్త లుక్‌లో ఎన్టీఆర్

## డ్రాగన్ కోసం ఎన్టీఆర్ కసరత్తులు

జూనియర్ ఎన్టీఆర్ , స్టార్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న డ్రాగన్‌పై అంచనాలు రోజురోజుకు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఎన్టీఆర్ న్యూ లుక్ సోషల్ మీడియాలో వైరల్ అవుతూ అభిమానుల్లో ఉత్సాహాన్ని రెట్టింపు చేసింది. తాజాగా బయటకు వచ్చిన లుక్‌లో ఎన్టీఆర్ కండలు తిరిగిన దేహంతో, బీస్ట్ మోడ్‌లో కనిపిస్తున్నారు. సన్నని నడుముతో క్లాసిక్ బ్యాక్ డబుల్ బైసెప్స్ పోజ్‌లో ఆయన ట్రాన్స్‌ఫర్మేషన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పవర్‌ఫుల్ యాక్షన్ పాత్ర కోసం ఎన్టీఆర్ కఠినమైన ట్రైనింగ్, ప్రత్యేక డైట్‌ను ఫాలో అవుతున్నట్లు తెలుస్తోంది. జిమ్‌లో ప్రాక్టీస్ చేస్తున్న ఫోటోను షేర్ చేస్తూ ఇది కష్టపడి తెచ్చుకున్న కండలు..కొన్నవి కావు.. అని ఆయన రాసిన క్యాప్షన్ కూడా వైరల్ అవుతోంది. ఇటీవల ఎన్టీఆర్ లుక్‌పై కొంత అసంతృప్తి ఏర్పడిందని, దాని వలన షూటింగ్ నిలిచిపోయిందంటూ ప్రచారం జరిగిన విషయం తెలిసిందే. అయితే దీనిపై చిత్ర నిర్మాతలు స్పష్టత ఇచ్చారు. ఆ వార్తల్లో ఎలాంటి నిజం లేదని, ఇది కేవలం రెగ్యులర్ షెడ్యూల్ బ్రేక్ మాత్రమేనని తెలిపారు. ప్రస్తుతం షూటింగ్ అనుకున్న ప్రణాళిక ప్రకారమే కొనసాగుతోందని పేర్కొన్నారు. ఇప్పటికే జోర్డాన్‌లో ఒక షెడ్యూల్ పూర్తయినట్లు సమాచారం. అలాగే హైదరాబాద్ సమీపంలోని శంషాబాద్ ప్రాంతంలో కూడా కీలక సన్నివేశాలు చిత్రీకరించినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా ఎన్టీఆర్‌పై యాక్షన్ సీక్వెన్స్‌లను చిత్రీకరించారని సమాచారం. తదుపరి షెడ్యూల్ కోసం భారీ సెట్స్ నిర్మాణం జరుగుతోంది.


# బాలకృష్ణ, గోపీచంద్ కాంబో

నటసింహం నందమూరి బాలకృష్ణ మరియు మాస్ డైరెక్టర్ గోపీచంద్ మలినేని కలయికలో తెరకెక్కుతున్న తాజా చిత్రంపై సినీ వర్గాల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇప్పటికే అనౌన్స్‌మెంట్‌తోనే హైప్ క్రియేట్ చేసిన ఈ ప్రాజెక్ట్ ఇప్పుడు మ్యూజిక్ పనులతో మరో అడుగు వేసింది. ఈ సినిమాకు సంగీత దర్శకుడు ఎస్.ఎస్. థమన్ ఇప్పటికే మ్యూజిక్ సిట్టింగ్స్ ప్రారంభించారు. తాజా సమాచారం ప్రకారం, రెండు ట్యూన్స్‌ను పూర్తిచేసిన థమన్, వాటిలో ఒక సాంగ్‌కి ప్రముఖ లిరిసిస్ట్ అనంత్ శ్రీరామ్‌తో పాట రాయించినట్టు తెలుస్తుంది. ఈ సాంగ్‌ను హైదరాబాద్‌లోని రామోజీ ఫిల్మ్ సిటీలో గ్రాండ్‌గా చిత్రీకరించేందుకు ఎ÷-లాన్ చేస్తున్నారు. ఈ సాంగ్ షూట్ పూర్తయ్యిన వెంటనే అక్కడే ఒక కీలక యాక్షన్ సీక్వెన్స్‌ను కూడా చిత్రీకరించనున్నట్లు సమాచారం. భారీ సెట్స్, విజువల్ గ్రాండియర్‌తో ఈ సన్నివేశాలు సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయని చిత్ర వర్గాలు చెబుతున్నాయి. ఈ సినిమాకు సంబంధించిన అనౌన్స్‌మెంట్ పోస్టర్‌లో బాలకృష్ణను ఒక రాజుగా చూపించగా, హీరోయిన్‌గా నయనతార మహారాణి పాత్రలో కనిపించనున్నట్లు సంకేతాలు ఇచ్చారు. దీంతో ఇది ఒక పీరియాడికల్ యాక్షన్ డ్రామాగా రూపొందుతున్నట్లు స్పష్టమవుతోంది. ఇప్పటికే బాలయ్య?నయనతార కాంబినేషన్ ప్రేక్షకులను పలుమార్లు మెప్పించింది. వీరిద్దరూ కలిసి నటించిన సింహా, శ్రీరామ రాజ్యం, జై సింహా చిత్రాలు మంచి విజయాలను అందుకున్నాయి. ఇప్పుడు మరోసారి ఈ జోడీ తెరపై కనిపించనుండటంతో అభిమానుల్లో ఆసక్తి మరింత పెరిగింది. ఈ భారీ ప్రాజెక్ట్‌ను నిర్మాత సతీష్ కిలారు నిర్మిస్తున్నారు. అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో తెరకెక్కుతున్న ఈ చిత్రం కథ, సెట్స్, యాక్షన్ సన్నివేశాలు ప్రత్యేకంగా ఉండబోతున్నాయని టాక్ వినిపిస్తోంది. మొత్తానికి, బాలయ్య-గోపీచంద్ మలినేని కాంబోలో వస్తున్న ఈ పీరియాడిక్ మూవీపై రోజురోజుకూ అంచనాలు పెరుగుతుండగా, త్వరలోనే మరిన్ని అప్‌డేట్స్ రానున్నాయి.




# నీ నవ్వులు సోకి మబ్బులు మెరుపులయ్యేనే..

మెగా ప్రిన్స్ వరుణ్‌తేజ్ కథానాయకుడిగా రూపొందుతున్న హారర్ కామెడీ అడ్వెంచర్ 'కొరియన్ కనకరాజు'. రితికా నాయక్ కథానాయిక. మేర్లపాక గాంధీ దర్శకుడు. యూవీ క్రియేషన్స్, ఫస్ట్‌ఫ్రేమ్ ఎంటర్‌టైన్మెంట్ కలిసి నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ దాదాపు పూర్తయింది. త్వరలోనే విడుదల తేదీని ప్రకటించనున్నారు. ప్రచారంలో భాగంగా ఈ సినిమా నుంచి తొలిపాటను శనివారం మేకర్స్ విడుదల చేశారు.'కమ్సాహంనిదా' అంటూ కొరియన్ భాషలో కథానాయిక పలకడం.. దాని అర్థం ఏంటి? అని కథానాయకుడు అడగడం.. 'అంటే.. కొరియన్ భాషలో ధన్యవాదాలు అని అర్థం' అంటూ ఆమె చెప్పడంతో పాట మొదలైంది. 'నీ నవ్వులు సోకి మబ్బులు మెరుపులయ్యేనే.. నీ కాళ్లే తాకి సంద్రం తీయగయ్యేనే..' అంటూ సాగే ఈ పాటను కాసర్ల శ్యామ్ రాయగా, ఎస్.ఎస్.థమన్ స్వరపరిచారు. సిద్ శ్రీరామ్ ఆలపించారు. యాష్ మాస్టర్ కొరియోగ్రఫీ అందించారు. హీరో ప్రేమలోని అమాయకత్వాన్ని ప్రజెంట్ చేసేలా ఈ పాట సాగింది. మాస్, రగ్డ్ లుక్‌తో వరుణ్‌తేజ్ స్క్రీన్ ప్రెజెన్స్, రితికాతో ఆయన కెమిస్ట్రీ ఆకట్టుకున్నది. కమెడియన్ సత్యా కీలకపాత్ర పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: మనోజ్‌రెడ్డి కాటసాని, ఎడిటింగ్: సత్యాజీ.



# భరతవర్ష మూవీతో వస్తోన్న గోపీచంద్




యాక్షన్ హీరో గోపీచంద్ మరో భారీ ప్రాజెక్ట్‌తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. వరుస ఫ్లాప్స్ తర్వాత సాలిడ్ హిట్ కోసం ఎదురుచూస్తున్న ఆయన ఈసారి పూర్తిగా భిన్నమైన కథతో 'భరతవర్ష' అనే పవర్‌ఫుల్ టైటిల్‌తో కొత్త సినిమాను ప్రకటించారు. టైటిల్ గ్లింప్స్ విడుదలయ్యాక సినిమా పై ఒక్కసారిగా భారీ అంచనాలు ఏర్పడ్డాయి. తాజాగా విడుదలైన గ్లింప్స్ వీడియోలో గోపీచంద్ యోధుడిగా కనిపిస్తూ ప్రేక్షకులను ఆకట్టుకున్నాడు. శత్రువులను ధైర్యంగా ఎదుర్కొంటూ యుద్ధరంగంలో విరుచుకుపడే సన్నివేశాలు గూస్‌బంప్స్ తెప్పించేలా ఉన్నాయి. విజువల్స్, బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్, యాక్షన్ ఎలిమెంట్స్ అన్నీ కలిసి సినిమా గ్రాండ్‌గా ఉండబోతుందనే సంకేతాలు ఇస్తున్నాయి. 'భరతవర్ష' అనే టైటిల్‌కు కూడా ప్రత్యేకమైన అర్థం ఉంది. పురాణాల ప్రకారం భరతవర్షం అంటే హిమాలయాల నుంచి సముద్రం వరకు విస్తరించిన అఖండ భారతదేశాన్ని సూచిస్తుంది. చక్రవర్తి భరతుడి పేరుమీదుగా ఈ పేరు వచ్చినట్లు చరిత్ర చెబుతుంది. ఈ నేపథ్యంలో సినిమా దేశభక్తి, చరిత్ర, మైథాలజీ అంశాలను మేళవించి రూపొందుతున్నట్టు తెలుస్తోంది. ఇండిపెండెన్స్‌కు ముందు జరిగే పీరియాడిక్ యాక్షన్ థ్రిల్లర్‌గా ఈ చిత్రం తెరకెక్కుతున్నట్లు

ఇండస్ట్రీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. కథలో మైథాలజీ టచ్ కూడా ఉండే అవకాశం ఉందని సమాచారం. ఈ కలయికతో సినిమా మరింత ఆసక్తికరంగా మారనుందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ చిత్రంలో గోపీచంద్ సరసన రీతూ వర్మ హీరోయిన్‌గా నటిస్తోంది. ఆమె పాత్ర కూడా కథలో కీలకంగా ఉండబోతుందట. టెక్నికల్‌గా హై స్టాండర్డ్స్‌తో ఈ సినిమాను రూపొందిస్తున్నారని, మేకర్స్ ఎక్కడా రాజీ పడటం లేదని తెలుస్తోంది. గోపీచంద్ కెరీర్‌లో ఇది ఒక టర్నింగ్ పాయింట్ మూవీ అవుతుందా అనే ఆసక్తి అభిమానుల్లో నెలకొంది. ఇప్పటివరకు వచ్చిన గ్లింప్స్, టైటిల్ ప్రభావం చూస్తే 'భరతవర్ష'తో ఆయన బలమైన కంబ్యాక్ ఇవ్వడం ఖాయం అన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ సినిమా విడుదల తేదీపై త్వరలోనే అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉంది.

Printed, Published, Edited & Owned by PAMMI YEDUKONDALU, Published From Door No. 2-2-14, 13th Ward, Komaravaram Road, TANUKU -534 211 West Godavari Dt., A.P., Printed at SRI SATYA OFFSET PRINTERS, Venkatrama Theater Street, TADEPALLIGUDEM - 534 102, West Godavari Dt., A.P. Editor : PAMMI YEDUKONDALU